ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



గుంటూరు
జిల్లా వార్తలు

3

మంగళవారం 31 డిసెంబరు 2024

6 ఐదేళ్ళ నిరాశ.. సీఎం మీదే ఆశ

పల్నాడు అభివృద్ధిపై ప్రజల ఎదురు చూపులు

జిల్లాపై సీఎం చంద్రబాబు వరాలు కురిపించేనా



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల తుది జాబితా విడుదల

- 3 లక్షల 46 వేల 529 మందికి ఓటుహక్కు
- అత్యధికంగా గుంటూరులో... అత్యల్పంగా ఏలూరులో ఓటర్లు

4



- యలమందలలో పింఛన్ల పంపిణీ
- గ్రామస్థులతో ముఖాముఖి
- కోటప్పకొండలో పూజలు



నేడు పల్నాడులో..
సీఎం పర్యటన

నరసరావుపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా పల్నాడు జిల్లా పర్యటనకు వస్తున్నారు. నరసరావుపేట నియోజకవర్గం, యలమందల గ్రామంలో నేడు జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. ఆయన పర్యటనకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. గ్రామంలో బీసీ వర్గానికి చెందిన ఉల్లంగుల ఏడుకొండలు, ఎస్సీ కాలనీకి చెందిన తలారి శారమ్మకు, సీఎం వారి ఇళ్లకు వెళ్లి పింఛన్‌లు పంపిణీ చేస్తారు. ఆయా కుటుంబాల యోగక్షేమాలను ఆయన తెలుసుకుంటారు. వారి ఇళ్లలో తేనీటి విందు చంద్రబాబు స్వీకరించనున్నారు. ఆయా ప్రాంతాల్లో రహదారులకు అధికారులు మరమ్మతులు నిర్వహించారు. పింఛన్‌ల పంపిణీ అనంతరం గ్రామంలోని రామాలయాన్ని సందర్శించి పూజలు చేస్తారు. ఆలయం ఎదుట గ్రామస్థులతో ముచ్చటిస్తారు. ఇందు కోసం వేదిక ఏర్పాటు చేశారు. ఇక్కడికి 1200 నుంచి 1500 మందిని మాత్రమే అనుమతిస్తున్నారు. వేదికపై కూడా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీని మాత్రమే అనుమతించనున్నారు. భారీ బహిరంగ సభలు.. జనసమీకరణలు లేవు. ఆర్భాటాలు లేకుండా వేదిక నిర్వహిస్తున్నారు. ప్రజలతో ముచ్చటించిన అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడతారు. జిల్లా అభివృద్ధిపై దిశా నిర్దేశం చేస్తారు. ఈ కార్యక్రమం అనంతరం రోడ్డు మార్గాన కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి సన్నిధికి చేరుకుంటారు. శ్రీ త్రికోటేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. అనంతరం కోటప్పకొండ నుంచి రోడ్డు మార్గాన యలమందల వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ చేరుకొని ఉండవల్లిలోని నివాసానికి చంద్రబాబు చేరుకుంటారు.


బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐజీ త్రిపాఠి, ఎస్పీ శ్రీనివాసరావు

భారీ బందోబస్తు

చంద్రబాబు పర్యటనకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. బందోబస్తు ఏర్పాట్లపై ఐజీ త్రిపాఠి, ఎస్పీ శ్రీనివాసరావు పోలీసు అధికారులతో సమీక్షించారు. సీఎం భద్రత కోసం రూపొందించిన బందోబస్తు ప్రణాళికను సిబ్బందికి తెలియజేశారు. సెక్టార్ల వారీగా బాధ్యతలను అధికారులు, సిబ్బందికి అప్పగించారు. హెలిప్యాడ్, పింఛన్ దారుల నివాసాలు, కోదండరామ స్వామి దేవాలయం, సభాస్థలి, కోటప్పకొండలో అన్ని చోట్ల విధులకు సిబ్బందిని కేటాయించారు. రోప్ పార్టీలు, రూట్ బందోబస్తు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, పార్కింగ్ సెక్టార్లలో పర్యవేక్షణకు అధికారులను నియమించారు. సీఎం పర్యటించే ప్రాంతాలలో డ్రోన్‌తో నిఘా ఉంచారు. సీఎం కాన్వాయ్ రిహార్సల్ నిర్వహించారు. డ్రోన్‌ల ద్వారా ఏర్పాట్లను ఎస్పీ శ్రీనివాసరావు పరిశీలించారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, జేసీ సూరజ్ ఏర్పాట్లను పరిశీలించారు.

ఆనందంగా ఉంది


ఏడుకొండలు

తమ ఇంటికి చంద్రబాబు వచ్చి పింఛన్ ఇస్తున్నారనే సమాచారం తెలుసుకున్న శారమ్మ, ఏడుకొండలు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. ఉల్లంగుల ఏడుకొండలు. ఇతనికి 68 ఏళ్లు. బీసీ వర్గానికి చెందిన వ్యక్తి. ఆయనకు కుమారుడు, కోడలు.. ఇరువురు కవలలైన మనుమలు ఉన్నారు. ఏడు కొండలు ఇంటికి చంద్రబాబు వెళ్లి రూ.4 వేలు వృద్ధాప్య పింఛన్ అందించనున్నారు. నా ఇంటికి చంద్రబాబు వస్తుండటం పట్టలేనంత సంతోషంగా ఉందని ఏడుకొండలు అన్నారు.

లారీ డ్రైవర్‌గా పనిచేసే శారమ్మ భర్త, 2021లో కరోనా రెండో విడతలో మృతి చెందాడు. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. 2023లో ఆమెకు వితంతు పింఛన్ మంజూరైంది. చంద్రబాబు తన ఇంటికి వచ్చి పింఛన్ ఇస్తారని అధికారులు వచ్చి చెబితే నమ్మలేకపోయాను. విలేకరులు వచ్చి వివ రాలు అడుగుతుంటే ఇప్పుడు నమ్ముతున్నాను. నిజంగానే చంద్రబాబు నా ఇంటికి వస్తున్నారు. చెప్పలేనంత ఆనందంగా ఉంది. ఆయన మా ఇంటికి రావడం మా అదృష్టమని శారమ్మ సంతోషాన్ని వ్యక్తం చేసింది.


తలారి శారమ్మ

ఎస్సీల స్థితిగతులపై అధ్యయనం

- ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా
- గుంటూరులో వినతుల స్వీకరణ

గుంటూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా షెడ్యూల్ కులాలకు చెందిన ప్రజల జీవన స్థితిగతులపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేసిన తర్వాత ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నట్లు ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా తెలిపారు. జిల్లాల పర్యటనలో భాగంగా ఆయన సోమవారం గుంటూరు జిల్లా కలెక్టరేట్‌కు వచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉండి అధికారులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అలానే వివిధ సంఘాల నాయకులు, ప్రతినిధుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఎస్సీలలోని ఉపకులాల వారీగా సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా స్థితిగతులపై ప్రభుత్వ శాఖల వారీగా సమగ్ర వివరాలతో కచ్చితమైన గణంకాలను సేకరిస్తున్నామని చైర్మన్ మిశ్రా తెలిపారు. అలానే ప్రభుత్వ పథకాలను వినియోగించుకొని పరిశ్రమలు ఏర్పాటు చేసి లబ్ధి పొందిన వారి వివరాలు కూడా సమగ్రంగా సేకరిస్తున్నామని చెప్పారు. అధికారులు అందించే వివరాలను పూర్తిగా అధ్యయనం చేసి రిమార్కులతో ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామన్నారు.



ఎస్సీ కులాల వర్గీకరణకు ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రా నిర్వహించిన సమావేశానికి హాజరైన కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్ ఇతర అధికారులు

జిల్లాలో ఎస్సీల్లోని ఉప కులాల సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా స్థితిగతులపై శాఖల వారీగా అధికారులు సమగ్ర వివరాలను కచ్చితమైన అంకెలతో అందించాలని రంజన్ మిశ్రా అధికారులను ఆదేశించారు. తొలుత కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్, సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ, జీయంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హాతో కలిసి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎస్సీల్లోని ఉపకులాల వారీగా స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలలోని ఉద్యోగులు, పాఠశాల, కళాశాల, ఉన్నత విద్యను అభ్యసిస్తున్న వారు, వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారులు, స్వయం సహాయక సంఘాల్లో, ప్రభుత్వ పథకాల ద్వారా పరిశ్రమలు ఏర్పాటు చేసిన వారు, వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి బ్యాంకుల ద్వారా రుణాలు పొందిన వారి వివరాలు సమగ్రంగా అందించాలన్నారు. అధికారులు అందించిన వివరాల ప్రకారం పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక అందించడం జరుగుతుందన్నారు. షెడ్యూల్ కులాలలో అతి తక్కువ శాతం ఉన్న ఇతర ఉప కులాల వారికి షెడ్యూల్ కుల ధ్రువీకరణ పత్రాల జారీకి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

కలెక్టర్ నాగలక్ష్మి, జిల్లా పరిషత్ సిఈఓ జ్యోతిబసు, డీపీఓ సాయికుమార్,డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి డీఈఓ రేణుక, జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ జయలక్ష్మి, ఎల్‌డీఎం మహిపాల్ రెడ్డి తదితరులు వారి శాఖల వివరాలను మిశ్రాకు వివరించారు. సమావేశం అనంతరం ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఏక సభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా షెడ్యూల్ కులాల ఉపవర్గీకరణపై ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజలు, కుల సంఘాల నాయకుల నుండి అభిప్రాయాలు, వినతులు స్వీకరించారు. తాడికొండ శాసన సభ్యుడు తెనాలి శ్రావణ్ కుమార్, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాదు, ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణమాదిగ, జాతీయ, రాష్ట్ర స్థాయి, ఉమ్మడి గుంటూరు జిల్లాల షెడ్యూల్ కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు షెడ్యూల్ కులాల వర్గీకరణ అంశంపై ఏక సభ్య కమిషన్ చైర్మన్‌కు అర్జీలు అందించి, అభిప్రాయాలను తెలిపారు. షెడ్యూల్ కులాల వర్గీకరణ అంశంపై అర్జీ అందించటానికి వచ్చిన విభిన్న ప్రతిభావంతుల వద్దకే ఏక సభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా వెళ్లి అర్జీలు స్వీకరించారు. షెడ్యూల్ కులాల వర్గీకరణ అంశానికి సంబంధించి మొత్తం 124 అర్జీలను అందించారు. ఈ సమావేశంలో గుంటూరు, బాపట్ల జిల్లాల రెవెన్యూ అధికారులు ఎస్ షేక్ ఖాజావలి, గంగాధరగౌడ్, ఆర్‌డీవో కే శ్రీనివాస రావు, డీడీ సోషల్ వెల్ఫేర్ మధు సూదన రావు, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ టి ప్రేమ కుమారి, ప్రజలు, కుల సంఘాల నాయకులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

న్యూ.. జోష్!

- ఆంగ్ల సంవత్సరాది ఆహ్వానానికి భారీ ఏర్పాట్లు
- చిన్నా.. పెద్ద వయోభేదం మరిచి కొత్త ఏడాది సందళ్లు
- కార్యాలయాలు, విద్యాసంస్థల్లో భారీ కార్యక్రమాలకు ఏర్పాట్లు
- కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతూ చర్చిల్లో ప్రత్యేక ఆరాధనలు
- పాత మిత్రుల గెట్ టూ గెదర్లు.. మందుబాబుల సిట్టింగులు
- అందమైన రంగవల్లులతో మహిళల స్వాగతాలు

6



పీఎం కిసాన్‌లో... 33,889 మంది
అనర్హులు

- లెక్కతేల్చిన వ్యవసాయ శాఖ
- ఐదేళ్లలో రూ.100 కోట్లు వారి ఖాతాల్లో జమ
- యాజమాన్య హక్కులు లేకున్నా లబ్ధిపొందిన వారు కోకొల్లలు
- ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన వారూ లబ్ధిదారులే

గుంటూరు సిటీ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లుగా గుట్టుచప్పుడు కాకుండా పీఎం కిసాన్ పథకం కింద లబ్ధి పొందుతున్న అనర్హుల లెక్క తేలిపోయింది. గుంటూరు జిల్లాలో 33889 మంది అనర్హులు ఉన్నట్లు వ్యవసాయ శాఖ లెక్క తేల్చింది. దాంతో 2019 నుంచి మొత్తం 1,21,898 మంది పీఎం కిసాన్ పథకం ద్వారా లబ్ధి పొందుతుండగా, తాజా సర్వేతో అర్హులైన లబ్ధిదారుల సంఖ్య 85,460 కి పరిమితం అయ్యింది. రైతులకు పెట్టుబడి సాయం కింద ఆర్థికంగా చేయూత నిచ్చే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2019 ఫిబ్రవరి లో పీఎం కిసాన్ పథకాన్ని అమల్లోకి తెచ్చింది. ఈ పథకంలో ఒక్కో రైతుకు రూ.6 వేల వరకు కేంద్రం చెల్లిస్తుంది. ఏడాదిలో మూడు విడతలుగా నేరుగా రైతు ఖాతాలోనే పీఎం కిసాన్ సొమ్మును జమ చేస్తున్నారు. అయితే అప్పట్లో రెవెన్యూ కార్యాలయంలో ఉన్న సమాచారం ఆధారంగా ఈ నగదు బదిలీ జరుగుతూ వచ్చింది. ఫలితంగా కొందరు అనర్హులు పీఎం కిసాన్ లబ్ధి పొందుతుండగా, చాలా మంది అనర్హులు ఈ పథకానికి దూరంగా ఉన్నారు. గడచిన ఐదేళ్ల కాలంలో అనర్హులైన వారు పీఎం కిసాన్ పథకం తమకు రావటం లేదని ప్రభుత్వానికి వేల కొద్దీ అర్జీలు ఇచ్చినా ఫలితం లేకుండా పోయింది. ప్రభుత్వం సర్వే కూడా ససేమిరా అంటూ వచ్చింది. తాజాగా కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ పీఎం కిసాన్ లోని అనర్హుల లెక్క తేల్చింది.



ఎన్నారైలూ లబ్ధిదారులే...

గత ఐదేళ్ల కాలంలో విదేశాల్లో నివసిస్తున్న (ఎన్నారై)లు కూడా పీఎం కిసాన్ కింద లబ్ధి పొందినట్లు వ్యవసాయ శాఖ సర్వే లో తేలింది. జిల్లాలో 465 మంది ఎన్నారైలకు ఈ పథకం కింద నగదు జమ అయ్యింది. ఒకే ఇంటి లో ఒకరికి మాత్రమే పథకం వర్తింప చేయాలని నిబంధన ఉండగా, 3799 మంది ఒకరికంటే ఎక్కువ మంది లబ్ధి పొందారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారు, ఉద్యోగం చేసి పదవీ విరమణ పొందిన 477 మంది ఇప్పటివరకు పథకాన్ని వినియోగించుకున్నారు. 2019 నాటికే పొలం అమ్ముకొని కూడా ఇప్పటివరకు 5866 మంది పీఎం కిసాన్ పథకం నగదును పొందుతూ వచ్చారు. స్థిరమైన భూ యాజమాన్య హక్కులు లేకుండా ఇప్పటివరకు 12747 మంది పథకాన్ని వాడుకున్నారు. 7247 మంది గుర్తు తెలియని, అడ్రెస్ లేని వ్యక్తులు కూడా ఇప్పటివరకు పీఎం కిసాన్ నగదును పొందారు. వీరు కాక ఆదాయపు పన్ను చెల్లిస్తూ ఈ పథకం కింద లబ్ధి పొందిన వారు 2325 మంది ఉన్నట్లు వ్యవసాయ శాఖ గుర్తించింది. అనర్హులను ఈ ఏడాది పీఎం కిసాన్ జాబితా నుండి తొలగించారు.

ఐదేళ్లలో....

గడచిన ఐదేళ్ల కాలంలో అనర్హులైన వారి ఖాతాలో రూ. 100 కోట్ల వరకు జమ అయ్యినట్లు తేలుతోంది. ప్రభుత్వ రికార్డులు సరిగా లేకపోవడంతో ఇంత సొమ్ము అనర్హులు అందినట్లు స్పష్టం అవుతోంది. ఇప్పటివరకు అనర్హుల ఖాతాలో జమ అయిన సొమ్మును వెనక్కి తెచ్చే విషయంలో కేంద్ర ప్రభుత్వం ఏమి చేస్తుందో వేచి చూడాల్సిందే.

- 'పశ్చిమ' రేషన్ షాపుల విభజనపై అనుమానాలు
- ఒక్కదాంట్లోనూ 800 కార్డులు మించి లేకుండా ముందుజాగ్రత్త
- చాలా దుకాణాలు 750 నుంచి 790 మధ్యన కార్డులు

మాఫియాకు..
ముందే తెలుసా..?

గుంటూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రేషన్ మాఫియా తన గుప్పిట్లో ఉన్న చౌకధరల దుకాణాల విభజన జరగకుండా ముందే జాగ్రత్త పడిందా? నగర పరిధిలో ఏ షాపులోనైనా 800, అంతకంటే ఎక్కువ కార్డులుంటే 600కు పరిమితం చేయాలని జారీ చేసిన ఆదేశాలకు అనుగుణంగా చాలా షాపులు 750 నుంచి 790కి సరి చేశారా? వంటి ప్రశ్నలు ప్రస్తుతం రేషన్‌డీలర్లలో వినిపిస్తున్నాయి. గుంటూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో షాపులను విభజించి కొత్తగా ఏర్పాటు చేసిన 66 దుకాణాల్లో డీలర్ల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయగా అందులో గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి ఒక్కటి కూడా లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. ఈ నేపథ్యంలో అసలు రేషన్‌కార్డుల సర్దుబాటు పశ్చిమ నియోజకవర్గంలో ఎప్పుడు చేశారన్నది విచారణ జరిపితే అసలు విషయాలు వెలుగులోకి వస్తాయన్న వాదనలు వినవస్తున్నాయి.

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో 90 రేషన్ దుకాణాలున్నాయి. తూర్పు నియోజకవర్గంతో పోల్చితే పశ్చిమలోనే ఎక్కువమంది రేషన్‌కార్డుదారులు సరుకులు తీసుకోరు. ఎండీయూలకే తమ సరుకులను విక్రయించి బదులుగా నగదు తీసుకొంటుంటారు. చాలా అపార్టుమెంట్ల వద్ద కూడా ఎండీయూ వాహనాలు ఆగుతుంటాయి. కొంతమంది ఆపరేటర్లు అయితే రేషన్‌కార్డులు కలిగిన కుటుంబాల ఇళ్ల వద్ద ఆపి మరి ఈపోస్‌లో వేలిముద్ర వేయించుకొని సరుకులు సరఫరా చేసినట్లుగా నమోదు చేసి నగదు చెల్లిస్తుంటారు. కేజీ రేషన్ బియ్యానికి రూ. 13 నుంచి రూ. 14 వరకు చేతిలో పెడుతున్నారు. కందిపప్పు, చక్కెర, రాగులు వంటివాటిని పక్కదారి పట్టించేస్తున్నారు. ఉన్న రేషన్ దుకాణాల్లో దాదాపుగా 20 షాపులు మాఫియాకు చెందిన వ్యక్తుల చేతుల్లోనే ఉన్నాయన్న విషయం బహిరంగ రహస్యమే. ఇదేవిధంగా కొన్ని డ్వాక్రా గ్రూపులకు కేటాయించిన దుకాణాలపై కూడా మాఫియాదే అజమాయిషి.

కాగా పశ్చిమ నియోజకవర్గంలోని రేషన్ మాఫియాకి షాపుల విభజన సమాచారం ముందుగానే ఉప్పందించి ఉంటారన్న అనుమానాలు కూడా కలుగుతున్నాయి. దాంతో కొన్ని నెలల ముందుగానే 800 కంటే ఎక్కువ సంఖ్యలో కార్డులున్న షాపుల నుంచి వాటిని తీసేసి వేరే వాటిల్లో సర్దుబాటు చేసి ఉంటారన్న ఆరోపణలు వస్తున్నాయి. దీని వలనే కొన్ని దుకాణాల్లో 780, 790 కార్డులున్నాయని కొంతమంది డీలర్లు పేర్కొంటున్నారు. నిబంధనల ప్రకారం రేషనలైజేషన్ చేయకుండా ఇలా కార్డుల సంఖ్య నిర్ణయించి విభజన చేయడంపై అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. 800 కార్డులుంటే షాపుని విభజన చేసి 200 కార్డులు కోత పెట్టి 600కు కుదించడం, 799 ఉన్నా దానిని పట్టించుకోకుండా చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో పశ్చిమలో కార్డుల సర్దుబాటుపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ జరిపితే అసలు విషయాలు వెలుగులోకి వస్తాయని తెలిపారు.

రిజిస్ట్రేషన్‌లకు ఆహ్వాన పత్రికలు పంపిణీ


రైతుకు ఆహ్వాన పత్రిక ఇస్తున్న సీఆర్డీఏ సిబ్బంది

తుళ్లూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాజధాని రైతులు తమ ప్లాట్లను రిజిస్ట్రేషన్‌లు చేసుకోవాలని తుళ్లూరు, నెక్కల్లు, అనంతవరం యూనిట్ సీఆర్డీఏ డిప్యూటీ కలెక్టర్ పెండ్యాల పద్మావతి కోరారు. ఈ మేరకు రైతులకు సంక్రాంతి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ రైతులు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని సిబ్బందితో ఆహ్వాన పత్రికలను సోమవారం ఆమె పంపిణీ చేయించారు. తద్వారా అమరావతి అభివృద్ధికి సహకరించాలని రైతులను పద్మావతి కోరారు. తుళ్లూరు సీఆర్డీఏ కార్యాలయంలోనే రెండు రిజిస్ట్రేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు వివరించారు.

నియోజకవర్గాల అభివృద్ధికి ప్రతిపాదనలు ఇవ్వండి

- ఇన్‌చార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్


సమావేశంలో మంత్రి గొట్టిపాటి. ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ, ఎంపీ లావు, కలెక్టర్ అరుణ్‌బాబు, ఐజీ త్రిపాఠి

నరసరావుపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తొలిసారి జిల్లాలో పర్యటిస్తున్న నేపథ్యంలో నియోజక వర్గాల పరిధిలో అభివృద్ధి. అవసరాలపై ప్రతిపాదనలను అందజేయాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు, ఎంపీ, ఎమ్మెల్యేలను కోరారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల కోరిక మేరకు నియోజకవర్గ సమస్యలు చర్చించేందుకు ముఖ్యమంత్రి పర్యటన అనంతరం జనవరి 4వ తేదీన డీఆర్సీ సమావేశం నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. జిల్లాలో పర్యాటక అభివృద్ధి విషయమై అటవీ శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేలు కోరారు. సమావేశంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, గుంటూరు రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జమ్ము కశ్మీర్‌పై జార్ఖండ్ ఇన్నింగ్స్ విజయం


అర్జున్ (150 పరుగులు, 6 వికెట్లు)

మంగళగిరి సిటీ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): విజయ్ మర్చంట్ ట్రోఫీలో భాగంగా మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో జరుగుతున్న మ్యాచ్‌లో జమ్ము కశ్మీర్‌పై జార్ఖండ్ జట్టు ఘనవిజయం సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో జమ్ము కశ్మీర్ 129 పరుగులు చేయగా, జార్ఖండ్ జట్టు 7 వికెట్ల నష్టానికి 365 పరుగుల వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన జమ్ము కశ్మీర్ జట్టు 220 పరుగులకు ఆలౌటయింది. వకాస్ నిసార్ 108 పరుగులతో రాణించాడు. జార్ఖండ్ ఆల్‌రౌండర్ అర్జున్ ప్రియదర్శి బ్యాటింగ్‌లో 150 పరుగులు చేయడంతోపాటు బౌలింగ్‌లోనూ రాణించి 6 వికెట్లు పడగొట్టాడు. దీంతో జార్ఖండ్ ఇన్నింగ్స్ 16 పరుగులతో భారీ విజయాన్ని నమోదు చేసింది.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల తుది జాబితా విడుదల

- 3 లక్షల 46 వేల 529 మందికి ఓటుహక్కు
- అత్యధికంగా గుంటూరులో... అత్యల్పంగా ఏలూరులో ఓటర్లు
- మహిళల కంటే పురుషులే అధికం

గుంటూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గ ఓటర్ల తుది జాబితాను జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి విడుదల చేశారు. ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఫైనల్ లిస్టుని పబ్లిష్ చేశారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఆ జాబితాను అందజేశారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల, కృష్ణ, ఎన్‌టీఆర్, ఏలూరు జిల్లాల్లోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈ ఓటర్లు లిస్టులను ప్రచురించారు. ఈసీ నిబంధనల మేరకు ఈ నెల 9వ తేదీ వరకు వచ్చిన క్లెయిమ్‌లన్నింటిని విచారించి అర్హత కలిగిన వారికి ఓటు హక్కు కల్పించారు.

నామినేషన్ల దాఖలు వరకు ఓటరు నమోదు ప్రక్రియ

పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నిక మరో మూడు నెలల్లో జరగనున్న విషయం తెలిసిందే. దీనికి సంబంధించి ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తాజా ఓటరు నమోదు ప్రక్రియని అక్టోబరు నెలలో ప్రారంభించింది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. ప్రతీ దరఖాస్తుని సచివాలయాల సిబ్బంది ద్వారా క్షేత్ర పరిశీలన చేయించి ఏఈఆర్‌వోల రిమార్కులతో ఈఆర్‌వోకు నివేదించారు. వాటిని ఈఆర్‌వో ఎస్.షేక్ ఖాజావలి ఆమోదించారు. తిరస్కరించిన వాటికి గల కారణాలను కూడా పరిశీలించి ఆమోదం తెలిపారు. తుది ఓటర్ల జాబితా ప్రకారం 3 లక్షల 46 వేల 529 మందికి ఓటుహక్కు కల్పించారు. ఇందులో పురుషులు 2 లక్షల 6 వేల 176, స్త్రీలు లక్ష 40 వేల 307, ఇతరులు 46 మంది ఉన్నారు. ఇందుకోసం 416 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే ఓటరు నమోదు ప్రక్రియ అనేది నామినేషన్ల దాఖలు వరకు జరుగుతుందని ఈఆర్‌వో ఖాజావలి తెలిపారు. అయితే ఇప్పటి నుంచి ఓటుహక్కు కల్పించే వారి పేర్లు ఆయా పోలింగ్ బూత్‌ల ఓటరు జాబితాల్లో సప్లిమెంట్‌లుగా చేరుస్తామన్నారు.

ఓటర్ల వివరాలు ఇలా....

జిల్లా	పోలింగ్ బూత్‌లు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం ఓటర్లు
ఏలూరు	20	9858	6218	1	16077
కృష్ణా	76	35378	27807	5	63190
ఎన్‌టీఆర్	101	45540	32685	13	78238
గుంటూరు	118	62277	45318	18	107613
బాపట్ల	28	15292	9150	5	24447
పల్నాడు	73	37831	19129	4	56964
మొత్తం	416	206176	140307	46	346529

ఎస్సీ వర్గీకరణపై సమగ్ర నివేదిక రూపొందించాలి


రాజీవ్ రంజన్ మిశ్రాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్


కమిషన్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాలమహానాడు నాయకులు అరుణ్‌కుమార్, జాన్‌పాల్, మేరీ

గుంటూరు(తూర్పు), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై ప్రతి ఒక్క అంశాన్ని పరిశీలించి సమగ్ర నివేదికను రూపొందించాలని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశం మందిరంలో సోమవారం ఎస్సీ వర్గీకరణపై నియమించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు ఆయన వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏకసభ్య కమిషన్‌కు వినతులకు అనుమతి కల్పించడం సంతోషంగా ఉందన్నారు. విద్యా, ఆర్థిక, ఉద్యోగ అవకాశాలు ఏ కులానికి అధికంగా అందుతున్నాయో కమిషన్ పరిశీలించాలన్నారు. 2014-19, 2019-24లో ఆయా ప్రభుత్వాల్లో ఎంత మేర లబ్ధి పొందిన అర్హుల జాబితాను పరిశీలించాలన్నారు.

ఎస్సీ వర్గీకరణ వద్దు... ఐక్యతే ముద్దు

గుంటూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ వద్దు... ఐక్యతే ముద్దు... వర్గీకరణను వ్యతిరేకిస్తున్నామంటూ రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్‌కు మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు, రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్, పలువురు నాయకులు వినతిపత్రం అందజేశారు. కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో సోమవారం జరిగిన రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ అభిప్రాయ సేకరణ కార్యక్రమానికి మాలమహానాడు నాయకులు హాజరయ్యారు. మాలమహానాడు నాయకులు అరుణ్‌కుమార్ మాట్లాడుతూ వార్డు, పంచాయతీల్లో ఏర్పాటు చేసిన ప్రదర్శనలో పూర్తిస్థాయి తప్పులు తడకలతో కూడిన సోషల్ ఆడిట్ ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. చాలాచోట్ల హిందూమాలకు బదులు క్రిస్టియన్ మాలగా చిత్రీకరిస్తున్నారని, అనేక చోట్ల సోషల్ ఆడిట్ ప్రదర్శనే లేదని, ప్రదర్శన లేని చోట మాలలు ఉన్నప్పటికీ జనాభా లెక్కల్లోకి రారన్నారు. మాలమహానాడు రాష్ట్ర మహిళా కార్యదర్శి పిల్లి మేరీ, రాష్ట్ర కార్యదర్శి సొంగా వెంకటరమణ, జిల్లా అధ్యక్షుడు ధారా హేమా ప్రసాద్, గోదా బాల, రాయని చిన్న, వెంకటేశ్వరరావు, డీజే శ్రీను, కీర్తిపాటి వెంకటేశ్వర్లు, మాలే కిరణ్, మాతంగి సుధాకర్, బొందలపాటి నాగేశ్వరరావు తదితరులున్నారు.

ఎస్సీ వర్గీకరణపై వైసీపీ ద్వంద్వ వైఖరి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై వైసీపీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తుందని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాదు విమర్శించారు. కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశం మందిరంలో సోమవారం ఎస్సీ వర్గీకరణపై నియమించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు ఆయన వినతి పత్రం అందజేశారు. అనంతరం డొక్కా మాణిక్య వరప్రసాదు మాట్లాడుతూ వర్గీకరణకు రాష్ట్రంలోని అన్ని పార్టీలు మద్దతు పలకగా వైసీపీ దొంగ నాటకాలు ఆడుతుందని మండిపడ్డారు. ఓ వైపు మాదిగలను మరోవైపు మాలలను రెచ్చగొడుతూ ఈ అంశాన్ని క్లిష్టతరం చేస్తుందని విమర్శించారు. ఉమ్మడి జిల్లాలో మాలల కంటే మాదిగలు అధికంగా ఉన్నారనీ, కానీ రిజర్వేషన్ల ఫలాలు మాలలకే వస్తున్నాయని అన్నారు. మాలలు కూడా వర్గీకరణకు మద్దతు ఇవ్వాలని కోరారు. కమిషన్ త్వరితగతిన అభిప్రాయాలను సేకరించి నివేదిక ప్రభుత్వానికి అందజేయాలన్నారు.

జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు పెంచాలి

పెరిగిన ఎస్సీ జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ల శాతం పెంచాలని ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ గోళ్ళమూడి రాజా సుందరంబాబు అన్నారు. కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశం మందిరంలో సోమవారం ఎస్సీ వర్గీకరణపై నియమించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు ఆయన వినతి పత్రం అందజేశారు.

వైసీపీ భూ అక్రమాలపై విజిలెన్స్ విచారణ


- మెడికల్ కళాశాల నిధులు పక్కదారి
- గురజాల ఎమ్మెల్యే యరపతినేని


సమావేశంలో మాట్లాడుతున్న గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ అక్రమాలపై విజిలెన్స్ అధికారులతో విచారణ జరుగుతుందనీ, భూములు లేకుండా అక్రమంగా రికార్డుల్లో పేర్లు మార్పులు చేర్పులు చేసి లేనిభూములకు బ్యాంక్‌ల్లో రుణాలు పొందిన వ్యవహారంపై విజిలెన్స్ అధికారులు ఇప్పటికే రంగంలోకి దిగారని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం పిడుగురాళ్ల పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2019 నుంచి 2024 ఎన్నికల ముందు వరకు గురజాల నియోజకవర్గంలో జరిగిన భూ అక్రమాలు వెలుగులోకి తీసుకురానున్నామన్నారు. 11 మంది టీడీపీ కార్యకర్తల హత్య, 8 మంది చిన్నారులను అక్రమ మైనింగ్‌తో పొట్టన పెట్టుకున్న వైసీపీ దురాగతాలను వెలికి తీయనున్నామని తెలిపారు. రాష్ట్ర రాజకీయాల్లో ఐదేళ్ల వైసీపీ అరాచకానికి చరమగీతం పాడి కూటమి ప్రభుత్వానికి విజయాన్ని అందించిన 2024 సంవత్సరాన్ని మర్చిపోలేమన్నారు. ఏపీ అభివృద్ధి చంద్రబాబు, పవన్ కల్యాణ్, కూటమి బీజేపీతోనే సాధ్యమవుతుందనే నమ్మకంతోనే ఎన్నికలలో రాష్ట్ర ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారన్నారు. వైసీపీ హయాంలో అన్ని శాఖలలో లెక్కకు రాని నిధులు ఉన్నాయనీ, వేటికి ఖర్చు చేశారో తెలియడం లేదన్నారు. గుంతలు లేని గురజాలగా మార్చేందుకు రూ. 15 కోట్ల నిధులు వచ్చాయన్నారు. కరెంటు కష్టాలకు జగన్ ప్రభుత్వమే కారణమని, నాసిరకం బొగ్గు సరఫరాతో రాష్ట్రాన్ని చీకటిమయం చేసిన వైసీపీకి నిరసన తెలిపే హక్కు లేదనీ, ఈ ఏడాది జరిగిన ఎన్నికల ఫలితాలను చూసి కూడా వైసీపీ నేతలకు ఇంకా బుద్ధి రాలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సాగర్ కాల్వల మేజర్, మైనర్‌ల మరమ్మతులను పూర్తి చేశామనీ, మరో రూ.5 కోట్ల నిధులు వచ్చాయన్నారు. మెడికల్ కళాశాలకు కేంద్ర ప్రభుత్వం నాబార్డు నిధులు ఇచ్చిందనీ, రూ. 200 కోట్ల నిధులు మెడికల్ కళాశాల నిర్మాణానికి ఖర్చు చేయాల్సి ఉండగా, ఆ నిధులు పక్కదారి పట్టాయన్నారు. గ్రామాలలో ఎన్ఆర్‌జీఎస్‌కు రూ. 20 కోట్లు, ఆర్అండ్‌బీ రోడ్ల మరమ్మతులకు రూ. 178 కోట్లు నిధులు వచ్చాయనీ, గురజాలలో అమృత స్కీమ్ కింద రూ. 9 కోట్లు, గురజాల, దాచేపల్లి, పిడుగురాళ్లకు తాగునీటి పథకాలకు జలజీవన్ మిషన్ కింద పనులు జరుగుతున్నాయన్నారు. గురజాల నియోజకవర్గానికి ఇండస్ట్రియల్ పార్కును కూడా ముఖ్యమంత్రి కేటాయించారని గుర్తు చేశారు. భట్రుపాలెం, ధైద, మోర్జంపాడు, గుత్తికొండ బిళంను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. షేక్ బాబావలి, పాండురంగ శ్రీను, గండికోట వెంకటేశ్వర్లు, కోట హరి, తురకా వీరస్వామి, వడ్డవల్లి సర్వేశ్వరరావు, పణితి రవి, వడ్డవల్లి సాంబశివరావు, పిల్లి చెన్నారావు, మేకల సాంబశివరావు, కామిశెట్టి రమేష్, వడ్లమూడి వెంకయ్య, ఖాశింసైదా, ఎల్‌వీఆర్, నర్రా సాంబశివరావు, బొల్లా శ్రీను పాల్గొన్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభం

- తొలిరోజు 166 మంది తదుపరి పరీక్షకు ఎంపిక


అభ్యర్థి ఎత్తును పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో సోమవారం కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభమయ్యాయి. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో తొలిరోజు 290 మంది అభ్యర్థులకుగానూ 166 మంది అభ్యర్థులు తదుపరి రాత పరీక్షలకు ఎంపికయ్యారు. దేహదారుఢ్య పరీక్షలకు 290 మంది హాజరుకాగా వారిలో 36 మంది సంబంధిత ధ్రువ పత్రాలు లేకపోవడంతో వెనుతిరిగారు. మిగిలిన 254 మంది అభ్యర్థులకు శరీర కొలత పరీక్షలు(ఫిజికల్ మెజర్మెంట్ టెస్ట్) నిర్వహించగా వారిలో 39 మందిని ఛాతీ, ఎత్తు కొలతలు సరిపోకపోవడంతో తిరస్కరించారు. మిగిలిన 215 మందికి 1600 మీటర్ల పరుగు పందెం నిర్వహించగా 32 మంది అర్హత సాధించలేకపోయారు. 183 మంది తదుపరి పరీక్షల కొరకు అర్హత సాధించారు. వారిలో ఒక వ్యక్తి స్వచ్ఛందంగా వైదొలగగా మిగిలిన 182 మందికి 100 మీటర్ల పరుగు పందెం నిర్వహించారు. వారిలో 74 మంది అర్హత సాధించారు. 182 మందికి లాంగ్ జంప్ నిర్వహించగా వారిలో 166 మంది అర్హత సాధించారు. మొత్తం 254 మంది కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించగా వారిలో 166 మంది తదుపరి పరీక్షలకు అర్హత సాధించారు.


అభ్యర్థులకు లాంగ్‌జంప్ పరీక్షలు

భావన్నారాయణ స్వామికి హైకోర్టు జడ్జి ప్రత్యేక పూజలు


భావన్నారాయణ స్వామిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి దుప్పల వెంకట రమణ

పొన్నూరుటౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణంలోని ప్రసిద్ధి చెందిన శ్రీ సాక్షి భవన్నారాయణ స్వామిని సోమవారం మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకట రమణ దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన హైకోర్టు న్యాయమూర్తి వెంకట రమణకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోని మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చక స్వాములు సాక్షి భవన్నారాయణ స్వామి ఆలయ విశేషాలను, చరిత్రను వివరించారు. ఈ పూజా కార్యక్రమాల్లో భాగంగా దేవదాయ శాఖ అధికారులు స్వామి వారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి, బాపట్ల మెజిస్ట్రేట్ జి.వాణి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వర్సిటీ వాలీబాల్ పోటీలు


విజేతలకు కప్ అందజేస్తున్న డాక్టర్ రాయపాటి శ్రీనివాస్

గుంటూరు (విద్య), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉమెన్ వాలీబాల్ టోర్నమెంట్ అంతర కళాశాలల పోటీలు సోమవారం చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఫార్మాస్యూటికల్ సైన్సెస్ (చిప్స్)ఫార్మసీ కళాశాలలో నిర్వహించారు. పోటీలకు నాగార్జున యూనివర్సిటీ పరిధిలోని మొత్తం పది టీమ్స్ హాజరైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ సూర్యదేవర విద్యాధర్ వెల్లడించారు. రెండు రౌండ్లుగా ఈ పోటీలు జరిగాయి. మొదటి రౌండ్ నాకౌట్ పద్ధతిలో నిర్వహించారు. ఈ రౌండ్‌లో విజేతలుగా నిలిచిన వారిని రెండో రౌండ్‌కి ఎంపిక చేశారు. రెండో రౌండ్ లీగ్ పద్ధతిలో నిర్వహించగా అందులో మొదటి స్థానంలో జేఎంజే (తెనాలి), రెండో స్థానంలో బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్, మూడో స్థానంలో యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలల టీమ్స్ నిలిచాయి. పోటీల్లో గెలుపొందిన వారికి కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు. సెక్రటరీ సీఎస్ శ్రీనివాస్, కోశాధికారి డాక్టర్ రాయపాటి గోపాలకృష్ణ, సంయుక్త కార్యదర్శి చుక్కపల్లి రమేష్, గోపీచంద్, వి.కుప్పుస్వామి తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా జాతీయ ఫ్లోర్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు


క్రీడాకారులను పరియం చేసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, చైర్మన్ నాతాని

నరసరావుపేట టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కే-రిడ్జి స్కూల్‌లో రెండు రోజుల నేషనల్ ఫ్లోర్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు సోమవారం ప్రారంభించారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో నేషనల్ క్రీడలను నిర్వహిస్తున్న కే-రిడ్జి స్కూల్ యాజమాన్యాన్ని ఎమ్మెల్యే అభినందించారు. ప్రారంభ మ్యాచ్ అండర్-12 బాలుర విభాగంలో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ జట్లు మధ్య జరిగిన మ్యాచ్ డ్రా గా ముగిసింది. రెండో అండర్-12 బాలికల విభాగంలో తమిళనాడు జట్టుపై 1-0 పాయింట్స్‌తో కర్ణాటక జట్టు విజయం సాధించింది. తరువాత మ్యాచ్ తమిళనాడు జట్టుపై ఆంధ్రప్రదేశ్ 1-0 పాయింట్స్‌తో విజయం సాధించింది. అండర్-17 బాలుర విభాగంలో తెలంగాణ జట్టుపై ఆంధ్రప్రదేశ్ 1-0 పాయింట్స్‌తో విజయం సాధించింది. కార్యక్రమంలో ఇండియన్ ఫ్లోర్‌బాల్ ఫెడరేషన్ వైస్ చైర్మన్ దీపేంద్ర ఆర్య, ఫ్లోర్‌బాల్ ఇండియా అబ్జర్వర్ పంకజ్, ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ ప్రీజో జాన్, ఏపీ ఫ్లోర్‌బాల్ సెక్రటరీ కేజే జోసెఫ్, డైరెక్టర్ కోమటినేని నాసరయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు న్యాయవాదుల విధుల బహిష్కరణ

గుంటూరు(లీగల్), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): పొన్నూరులో న్యాయవాదిని పోలీసులు చిత్రహింసలకు గురి చేయటాన్ని నిరసిస్తూ మంగళవారం జిల్లా వ్యాప్తంగా న్యాయవాదులు కోర్టుల్లో తమ విధులను బహిష్కరించి నిరసన తెలపాలని నిర్ణయించారు. గుంటూరు జిల్లా బార్ అసోసియేషన్ల ఫెడరేషన్ చైర్మన్ కాసు వెంకటరెడ్డి ఈ మేరకు జిల్లాలోని అన్ని బార్ అసోసియేషన్‌లకు పిలుపునిచ్చారు. క్రిస్మస్ సందర్భంగా గాయపడిన వారిని పరామర్శించేందుకు పొన్నూరుకు చెందిన దళిత న్యాయవాది బేతాళ ప్రకాశరావు నాలుగు రోజుల క్రితం ఆసుపత్రికి వెళ్లగా, అతన్ని ఆసుపత్రి నుంచి పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లి సీఐ రవికిరణ్ ఆధ్వర్యంలో ఎస్ఐ రాజ్‌కుమార్, కానిస్టేబుల్ గోపి, మాధవ గోపి, స్టేషన్ కంప్యూటర్ ఆపరేటర్ మల్లికార్జునరావు అరికాళ్లు, చేతులపై కొట్టి చిత్రహింసలకు గురిచేసి దూషించారని ప్రకాష్‌రావు అరచేతి ఎముక విరిగిందని న్యాయవాదులు ఆరోపిస్తున్నారు. సంబంధిత పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత నాలుగు రోజులుగా పొన్నూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఆందోళన చేస్తున్నారు. వీరికి సంఘీభావంగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా న్యాయవాదులు కోర్టు విధులకు గైర్హాజరు కావాలని తీర్మానించారు. గుంటూరు రేంజ్ ఐజీని కలిసి సంబంధిత పోలీసు అధికారులను విధుల నుంచి తొలగించాలని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రం అందజేయాలని నిర్ణయించారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 571.40 అడుగులు ఉంది. ఇది 260.08 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8144 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8108 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 21168 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 40,120 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 39.93 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా రెండు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	107,115,126
చికెన్ విత్ స్కిన్	204.00
చికెన్ స్కిన్ లెస్	214.00

50,214 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 55,760 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 50,214 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 46,445 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	13500	334	7500	14000
నెంబరు. 5	8000	8500	నెంబరు.5	--	--
273	8000	10500	273	9000	11500
341	8000	15500	341	8000	13000
4884	10500	14000	4884	--	--
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	16300	తేజ	8000	16000
బ్యాడిగి	7500	13500	బ్యాడిగి	9000	13000
దేవనూరు డీలక్స్	8500	15000	దేవనూరు డీలక్స్	12000	13000
తెల్లకాయలు	4000	10500	తెల్లకాయలు	4000	9500

ముగిసిన జూనియర్ వాలీబాల్ పోటీలు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న జూనియర్ వాలీబాల్ పోటీలు సోమవారంతో ముగిశాయి. పోటీల్లో షాలోమా పాఠశాల విజేతగా నిలిచి ట్రోఫి కైవసం చేసుకుంది. ద్వితీయ స్థానంలో లోటస్ విద్య పాఠశాల నిలిచింది. విజేతలకు ఫౌండేషన్ కార్యదర్శి జీవీఎస్ ప్రసాదు, కోచ్ బీ కృష్ణారావు ట్రోఫీలు, సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో చంద్రబోస్, పీఈటీ సతీష్ పాల్గొన్నారు.

తిరుప్పావై 20వ పాశురంపై ప్రవచనం

గుంటూరు(తూర్పు), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం పద్మావతి కల్యాణవేదికపై ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం తిరుప్పావై అమృతవర్షిణి డాక్టర్ కోగంటి వేంకట శ్రీరంగ నాయకిచే తిరుప్పావై 20వ పాశురంపై ప్రవచనం చేశారు. తొలుత ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

బీఈడీ రికార్డుల మూల్యాంకనాన్ని పాతపద్ధతిలోనే కొనసాగించాలి

గుంటూరు(విద్య), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): బీఈడీ రికార్డుల మూల్యాంకనాన్ని పాత పద్ధతిలోనే కొనసాగించాలని కోరుతూ బీఈడీ టీచర్స్, ఎడ్యుకేటర్స్ సోమవారం వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్, రెక్టార్లకు సోమవారం వినతి పత్రాలు అందజేశారు. నాలుగు సెమిస్టర్ల రికార్డుల మూల్యాంకనాన్ని తొలగించి, వెరిఫికేషన్ చేసే ప్రక్రియ నిబంధనలకు విరుద్ధమని ఆందోళన వ్యక్తం చేశారు. అధ్యాపకులు లేకుండా ప్రయోగ పరీక్ష, పబ్లిక్ పరీక్షలు నిర్వ హిస్తున్నారని, మరోవైపు జిరాక్స్ సర్టిఫికెట్లతో బీఈడీ కోర్సును యాజమాన్యాలు నిర్వీర్యం చేస్తున్నాయని అన్నారు.

మినీ కవిత సదస్సు

గుంటూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): విజయవాడలో నిర్వహిస్తున్న 6వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో మూడో వేదిక మీద మినీ కవిత సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా 'మినీ కవిత వెలుగులు' గ్రంథాన్ని ప్రముఖ భాషా ప్రేమికులు కంచర్ల విజయ భాస్కర్ ఆవిష్కరించారు. ఫేస్‌బుక్ 'అమరావతి సాహితీ మిత్రులు' గ్రూపులో డాక్టర్ రావి రంగారావు 2024 జనవరి నుంచి మార్చి వరకు 13 వారాలు నిర్వహించిన మినీ కవితల పోటీల ఫలితాల విశ్లేషణలు, విజేతల మినీ కవితలతో పాటు ఎడిట్ చేసి ప్రచురించిన మినీ కవితలను కూడా "మినీ కవిత వెలుగులు' పుస్తకంగా బంగారు వీబీ ఆచార్యులు ప్రచురించారు. తొలి ప్రతిని డాక్టర్ జీవీ పూర్ణచంద్‌కు, మలి ప్రతిని మొండెపు ప్రసాద్‌కు రంగారావు అందజేశారు. ఈ సదస్సులో వసుధ బసవేశ్వర రావు, మాధవి సనారా, బెహరా ఉమామహేశ్వరరావు పలువురు ప్రముఖులున్నారు.

డాక్టర్ కేఎల్‌పీ స్కూల్ విద్యార్థిని ప్రతిభ

గుంటూరు(విద్య), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో విజయవాడ సిద్దార్థలో జరిగిన అబాకస్ పోటీల్లో డాక్టర్ కేఎల్‌పీ స్కూల్ విద్యార్థిని రన్నరప్‌గా నిలిచినట్లు పాఠశాల కార్యదర్శి డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న డీ.వెంకటవిద్యారాణి మొదటి రన్నరప్‌గా నిలిచిందని, త్వరలో చెన్నైలో జరిగే పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యార్థిని పాఠశాల ప్రిన్సిపాల్ రత్తయ్య తదితరులు అభినందించారు.

ఇళ్ల నిర్మాణాల్లో లక్ష్యాలను అధిగమించాలి

● కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాలు


కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): హౌసింగ్ లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను ప్రతి వారం నిర్దేశించిన లక్ష్యాలను ఖచ్చితంగా అధిగమించే విధంగా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి ఆమె జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రత్యేక అధికారులు, మున్సి పల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో హౌసింగ్ లే అవుట్ల లో ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ప్రతివారం ఎంపీడీవో, హౌసింగ్ అధికారులు సచివాలయ ఉద్యోగులతో లేఅవుట్ల వారీగా సమీక్ష నిర్వహించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సక్షమ్ ద్వారా మంజూరు చేసిన తాగునీటి సరఫరా, మరుగుదొడ్ల నిర్మాణాలు సంక్రాంతి నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయ ఉద్యోగులు ప్రతి రోజు ఆన్‌లైన్ హాజరు వేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సంక్రాంతి నాటికి రోడ్ల మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ ప్రసాదు, సీపీవో శేషశ్రీ, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి, డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి, డ్వామా పీడీ శంకర్, భూగర్భ జలవనరుల శాఖ డీడీ వందనం, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజరు జయలక్ష్మి, డీపీవో సాయికుమార్, పంచాయతీరాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య, జీఎస్ డబ్ల్యూఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

● హైకోర్టు న్యాయవాది అనుపమ దార్ల

గుంటూరు(విద్య), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): సాంకేతిక యుగంలో ప్రతి వ్యక్తి జీవితంలో ఇంటర్నెట్ వాడకం భాగమైందని ఈ నేపథ్యంలో సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని హైకోర్టు న్యాయవాది అనుపమ దార్ల అన్నారు. చౌడవరంలోని ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం సైబర్ సెక్యూరిటీపై నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. సెల్‌ఫోన్ యాప్ డౌన్ లోడ్ ప్రక్రియలో మన పూర్తి వ్యక్తిగత సమాచారాన్ని ఇస్తామని, ఆన్‌లైన్ ద్వారా మనం శోధించే సమాచారానికి అనుగుణంగా మన అవసరాలను సైబర్ నేరగాళ్లు సంగ్రహిస్తారని అనుపమ పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు, ఉద్యోగాల నియామకం, క్రెడిట్ కార్డ్స్ తదితర వాటిపై ఆశ పెడుతూ నేరాలకు పాల్పడటమే కాకుండా పోలీసుల వేషంలో డిజిటల్ అరెస్టులు అని భయభ్రాంతులకు గురిచేస్తారని అన్నారు. డిజిటల్ అరెస్టులు అసలుండవని స్పష్టం చేశారు. సమస్యలు ఎదురైనప్పుడు 1930కి కాల్ చేసి సైబర్ నేరాలను అడ్డుకోవాలన్నారు. సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ డాక్టర్ కొమ్మినేని రవీంద్ర పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో డేటా చౌర్యం కేసులో విలేకరికి నోటీసు జారీ

గుంటూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో జరిగిన డేటా చౌర్యం కేసులో నిందితుడిగా ఉన్న ఒక విలేకరికి పోలీసులు నోటీసులు జారీ చేసారు. రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌కు పోలీస్ కస్టడీ సమయంలో స్టేషన్‌లో రాచ మర్యాదలు చేసిన ఘటనకు సంబంధించి అరండల్‌పేట స్టేషన్‌లోని సీసీ కెమెరా ఫుటేజీ లీకైంది. దీనిపై అరండల్‌పేట స్టేషన్‌లో ఓ టెక్నీషియన్‌తో సహా విలేకరి, కెమెరామన్ వంశీలపై కేసు నమోదైంది. ఆ కేసులో రెండో నిందితుడైన విలేకరి కోసం పది రోజులు పాటు పోలీస్ అధికారులు, సిబ్బంది నాలుగు బృందాలుగా విడిపోయి, హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాల్లో గాలింపు నిర్వహించారు. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో పోలీసులు విలేకరిని అదుపులోకి తీసుకుని గుంటూరుకు తీసుకువచ్చారు. అయితే డీజీపీ కార్యాలయ వర్గాల ఆదేశాల మేరకు విలేకరికి 41ఎ నోటీసు జారీ చేసి పంపారు.

ఘనంగా పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గుంటూరు(తూర్పు), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లపాడులోని లయోలా పబ్లిక్ పాఠశాలలో సోమవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. పాఠశాల యాజమాన్యం, పూర్వ విద్యార్థి సంఘం కలిసి 1974, 1999 బ్యాచ్ విద్యార్థులను ఘనంగా సత్కరించారు. పాఠశాల సుపీరియర్, కరస్పాండెంట్ పోతిరెడ్డి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు చేస్తున్న సాయం గొప్పదన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు పరోక్షంగా, ప్రత్యక్షంగా పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ పీ.నరేష్, పూర్వ విద్యార్థి సంఘ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, రమేష్, మరియ ప్రసాదు, అనిల్ కుమార్ పాల్గొన్నారు.


జిల్లా పర్యటనకు వచ్చిన రాజీవ్ రంజన్ మిశ్రాకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, చిత్రంలో కమిషనర్ శ్రీనివాసులు


రాజీవ్ రంజన్ మిశ్రాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్


నారాయణరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి

కోవెలమూడి నారాయణరావుకి ప్రముఖుల నివాళి

గుంటూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జోన్-5 ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర(నాని) తండ్రి కోవెలమూడి నారాయణరావు సంస్మరణ కార్యక్రమం శ్రీసత్య సాయి జిల్లా పుట్టపర్తిలో సోమవారం ఘనంగా జరిగింది. పుట్టపర్తిలోని శ్రీపెద్ద వెంకమ రాజు కల్యాణ మండపం (పాత మందిరం)లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రంలోని అనేక మంది ప్రముఖులు పాల్గొని నారాయణరావుకు నివాళి అర్పించారు. శ్రీసత్యసాయి ప్రశాంతి నిలయం ట్రస్ట్ చైర్మన్ రత్నాకర్, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత, హిందూ పురం ఎంపీ బీకే పార్థసారధి, మాజీ మంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, కదిరి ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, గళ్లా రామచంద్ర రావు దంపతులు, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ మంత్రులు కాల్వ శ్రీనివాసులు, పల్లె రఘునాథ్, టీడీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు అంజనప్ప, మడకశిర మాజీ ఎమ్మెల్యే ఈరన్న, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ చైర్మన్ డేగల ప్రభాకర్, జనసేన రాష్ట్ర నాయకుడు, అర్బన్ బ్యాంకు చైర్మన్ బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, టీడీపీ సీనియర్ నాయకుడు వడ్లమూడి పూర్ణచంద్రరావు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని డివిజన్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్పొరేటర్లు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గం లోని రాష్ట్ర, జిల్లా, నగర, అనుబంధ విభాగాల ముఖ్యనాయకులు, మహిళలు, కార్యకర్తలు, పుట్టపర్తి స్థానిక నేతలు, జోన్- 5 తెలుగుదేశం పార్టీ ముఖ్యనాయకులు పాల్గొన్నారు. నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

నారాయణరావు సేవలు మరువలేనివి : కంచర్ల

కోవెలమూడి నారాయణరావు దశదినకర్మ సందర్భంగా సోమవారం టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసరావు, కంచర్ల కిరణ్మయి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బ్రాడీపేటలోని శ్రీషిరిడి సాయి దీనజన సేవాసమితి ప్రాంగణంలో కంచర్ల కిరణ్మయి చేతుల మీదు గా విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనాథలకు అల్పాహారం ఏర్పాటు చేశారు.

కలెక్టరేట్ భద్రతని పటిష్టం చేయాలి : డీఆర్‌వో

గుంటూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో వివిధ ప్రభుత్వ శాఖలున్నందున ప్రాంగణం భద్రతని కట్టుదిట్టం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కే ఖాజావలి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వివిధ కార్యాలయాలను ఆయన పరిశీలించారు. అనంతరం తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. డీఆర్‌వో మాట్లాడుతూ కలెక్టరేట్‌లో నిఘా నేత్రాలు నిరంతరం పని చేసేలా చూడాలన్నారు. ఉద్యోగులకు గుర్తింపు కార్డుల జారీ, ప్రహరీ ఎత్తు పెంపు వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. అనధికార వ్యక్తులు కలెక్టరేట్‌లోకి రాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఇంటెలిజెన్స్, అగ్నిమాపక, రోడ్లు, భవనాలు, మత్స్య తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

యువత నైపుణ్యాలను పెంపొందించుకుంటేనే అద్భుత అవకాశాలు

● ఏఎన్‌యూ ప్రొఫెసర్ సరస్వతి రాజు అయ్యర్

గుంటూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువత తమ నైపుణ్యాలను మరింత పెంపొందించుకుంటేనే అద్భుత అవకాశాలు అందుకోగలరని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సరస్వతి రాజు అయ్యర్ తెలిపారు. గోరంట్లలోని బీస్క్వేర్ కన్వెన్షన్ హాల్లో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ అల్లడి దేవ కుమార్ అధ్యక్షతన యువత, ఉపాధి, సవాళ్లు, అవకాశాలు అనే అంశంపై సోమవారం జరిగిన రాష్ట్ర సదస్సులో ఆమె ప్రధాన వక్తగా ప్రసంగించారు. ఆమె మాట్లాడుతూ యువత లక్ష్యాలకు అనుగుణంగా కృషి చేయాలని కోరారు. అల్లడి దేవకుమార్ మాట్లాడుతూ ఫుడ్ ప్రాసెసింగ్, వైద్యం, ఆరోగ్య రంగాల్లో అపారమైన అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రముఖ సీనియర్ సైకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు మాట్లాడుతూ యువత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్, గౌతమ బుద్ధుని బోధనలను అనుసరించి తమ భవిష్యత్తును తామే తీర్చుకోవాలని ఉద్బోధించారు. ఎస్‌బీఐ మేనేజర్ మేడికొండ సునీల్, రూట్‌సెట్ డైరెక్టర్ పీవీ కుమార్, పీఎంఎఫ్ఎంఈ సాయికృష్ణ ప్రసంగించారు. ఆరు జిల్లాల నుంచి 150 మంది నిరుద్యోగ యువతీ, యువకులు పాల్గొన్నారు.

జేకేసీ కళాశాలతో మనసు ఫౌండేషన్ ఎంవోయూ

● 80 వేల తెలుగు పుస్తకాలు ఆన్‌లైన్‌లో లభించేలా ఏర్పాట్లు

గుంటూరు(విద్య), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక జేకేసీ కళాశాల, బెంగళూరులోని మనసు ఫౌండేషన్ సంస్థ సంయుక్తంగా సోమవారం అవగాహన ఒప్పందం చేసుకున్నాయి. ఈ ఒప్పందం ప్రకారం అరుదైన 80వేలకుపైగా తెలుగు పుస్తకాల పీడీఎఫ్ ఫార్మెట్‌లో కళాశాల విద్యార్థులకు, అధ్యాపకులకు, జేకేసీ కళాశాలలోని గ్రంథాలయంలో అందుబాటులోని రానున్నాయి. మాతృభాషకు మరింత ప్రాధాన్యం కల్పించేలా ఏర్పాట్లు చేయనున్నట్లు కళాశాల కార్యదర్శి జాగర్లమూడి మురళీమోహన్ తెలిపారు. మనసు ఫౌండేషన్ చైర్మన్ మన్నం వెంకటరాయుడు, జేకేసీ కళాశాల కార్యదర్శి జాగర్లమూడి మురళీమోహన్, ప్రిన్సిపాల్ పరుచూరి గోపిచంద్, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్ఆర్‌కే ప్రసాద్, గ్రంథాలయాధికారి చెరుకూరి నాగభవాని, పారా అశోక్ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణ సీసీ కెమెరాలతోనే సాధ్యం

● వ్యాపారులతో ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్

గుంటూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణ సీసీ కెమెరాలతోనే సాధ్యమవుతుందని ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ స్పష్టం చేశారు ఈ మేరకు సోమవారం లాలాపేట పోలీస్‌స్టేషన్లో సీఐ శివప్రసాద్ ఆధ్వర్యంలో వర్తక వ్యాపార వర్గాలతో సమావేశం నిర్వహించారు. బంగారు దుకాణాలతో సహా అన్ని రకాల వ్యాపార కేంద్రమైన లాలాపేట ప్రాంతంలో దొంగతనాలతో పాటు వివిధ రకాలైన నేరాలకు ఎక్కువ ఆస్కారం ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో ఆయా నేరాలను అరికట్టేందుకుగాను లాలాపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో పెద్ద ఎత్తున సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డీఎస్పీ అబ్దుల్ అజీజ్ స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో నేరాల నియంత్రణతో పాటు నేరస్తులను గుర్తించేందుకు సీసీ కెమెరాలే కీలకం కాబోతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో పట్నంబజార్ ప్రాం తంలో పెద్ద ఎత్తున సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించేందుకు ప్రజారక్షణ చట్టంలో భాగంగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి వ్యాపారి తమ దుకాణంలో కదలికలన్నీ రికార్డు చేసే విధంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు షాపు బయట రోడ్డును కవర్ చేసే విధంగా తప్పనిసరిగా సీసీ కెమెరాలు అమర్చుకోవాలని సూచించారు. లాలాపేట సీఐ శివప్రసాద్ మాట్లాడుతూ వ్యాపార వర్గాలు నేరాల నియంత్రణలో పోలీసులకు సహకరించాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తుంటే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో దివ్యాంగుడి ఇల్లు దగ్ధం

గుంటూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెంలో యల్లటూరి జయ రాంబాబు అనే దివ్యాంగుడి ఇల్లు విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ వల్ల రాత్రి ఒంటి గంట సమయంలో పూర్తిగా దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బందికి విషయం తెలపగానే హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అగ్ని మాపక సిబ్బంది త్వరగా స్పందించకపోయినట్లయితే మంటలు చెలరేగి ఎక్కువ ప్రమాదం జరిగి ఉండేదని బాధితులు, స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదానికి కారణం కేవలం విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమేనని బాధితులు వాపోయారు. అంతేకాకుండా ప్రతిరోజు చిన్న గాలికి కూడా ఫీజులు పోయి గంటలు గంటలు అంధకారంలో ఉండాల్సిన పరిస్థితి ఉందని అన్నారు. ఈ విషయమై పలుమార్లు విద్యుత్ అధికారులకు విన్నవించుకున్నా ఫలితం శూన్యమని స్థానికులు ఆరోపించారు. ఇల్లు దగ్ధమై వీధిన పడిన బాధితులను స్థానిక సర్పంచ్ పరామర్శించి తనవంతుగా కొంత నగదు, బియ్యం, దుస్తులు అందించి అంతేకాకుండా ప్రభుత్వం ద్వారా బాధితులకు రావలసిన సహాయ సహకారాలు అందేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆమె అన్నారు.

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకం

● ఆర్‌వీఆర్ బీఈడీ కళాశాల కార్యదర్శి గద్దె మంగయ్య

గుంటూరు(విద్య), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, ఇందుకు అనుగుణంగా బీఈడీ విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఆర్వీఆర్ బీఈడీ కళాశాల కార్యదర్శి గద్దె మంగయ్య అన్నారు. సోమవారం కళాశాలలో స్టూడెంట్ ఇండక్షన్ కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజాన్ని మార్చే శక్తి ఉపాధ్యాయులకు ఉందని, మెరుగైన బోధనతో మంచి పౌరుల్ని సమాజానికి అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోటూరి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



న్యూ..జోష్



విద్యుత్ వెలుగుల్లో గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లో వెంకటేశ్వరస్వామి దేవాలయం

- ఆంగ్ల సంవత్సరాది ఆహ్వానానికి భారీ ఏర్పాట్లు
- చిన్నా.. పెద్ద వయోభేదం మరిచి కొత్త ఏడాది సందళ్లు
- కార్యాలయాలు, విద్యాసంస్థల్లో భారీ కార్యక్రమాలకు ఏర్పాట్లు
- కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతూ చర్చిల్లో ప్రత్యేక ఆరాధనలు
- పాత మిత్రుల గెట్ టూ గెథర్లు.. మందుబాబుల సిట్టింగులు
- అందమైన రంగవల్లులతో మహిళల స్వాగతాలు

కొత్త ఏడాది అంటే.. కొత్త ఆశలు.. కొంగొత్త ఆకాంక్షలు.. సరికొత్త ఆలోచనలు! గతం తాలూకు చేదు అనుభవాలను మరిచిపోయి.. మంచిని పంచుకుంటూ కొత్త ఏడాదిలో అడుగుపెట్టే అద్భుతమైన పండుగరోజు.. జనవరి 1. అందుకే కులమతాలకు అతీతంగా అందరూ న్యూ ఇయర్ వేడుకలు జరుపుకుంటారు. అది పేరుకు ఆంగ్ల సంవత్సరాదే అయినా.. అందరి సొంత పండుగలా మారిపోయింది. ప్రతి ఇంట్లో సందడి చేస్తోంది. ఎప్పటిలాగే ఈ కొత్త ఏడాదికి ఘనంగా స్వాగతం పలికేందుకు అందరూ సిద్ధమవుతున్నారు. చిన్నారులు మొదలు.. పెద్దల వరకూ అందరూ కొత్త ఏడాది.. కొత్త వెలుగులను జీవితంలోకి ఆహ్వానించేందుకు ఎవరెవరి స్థాయిలో వారు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

గుంటూరు, డిసెంబరు, 30 (ఆంధ్రజ్యోతి): కొత్త ఏడాది వేడుకల్లో కుర్రకారుది ప్రత్యేకమైన స్థానం. యువకులంతా ఒక్కచోటికి చేరి చేసే సందడి అంతా ఇంతా కాదు. కొత్త ఏడాదికి ముందు రోజు నుంచే వారి సందడి మొదలవుతుంది. నేటి సాయంత్రం నుంచే వారి సం దడి కనిపిస్తుంది. బైకులను రయ్.. రయ్.. మనిపిస్తూ, కేరింతలు కొడుతూ రోడ్లపై వారు చేసే సందడి అంతా ఇంతా కాదు.. ఈ ఏడాది వారి సందడి మరింత ఇనుమడించింది. కూడళ్లలో భారీ కేకులు ఏర్పాటుచేసుకుని వాటిని కట్ చేసి కొత్త ఏడాదిని స్వాగతించేందుకు వారు భారీ ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

కార్యాలయాల్లో సందడి..

పలు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు న్యూ ఇయర్ వేడుకలకు సిద్ధమయ్యాయి. కార్యాలయాలను అందంగా అలంకరించుకోవడంతో మొదలైన న్యూ ఇయర్ వేడుకలు జనవరి 1వ తేదీ కేక్ కటింగు వరకూ అట్టహాసంగా జరుపుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. విద్యాసంస్థల్లో జరిగే న్యూ ఇయర్ వేడుకల సంగతి సరేసరి.. చిన్నారుల నృత్యాలు, పాటలు, మ్యూజికల్ నైట్లు వంటి పలు ప్రత్యేక కార్యక్రమాలతో కొత్త ఏడాది సంబరాలు అంబరాన్ని అంటనున్నాయి.

గేటెడ్ సందడి!

గతంలో ఎన్నడూ లేని విధంగా గేటెడ్ కమ్యూనిటీల్లో న్యూ ఇయర్ వేడుకలు జరుగుతున్నాయి. కమ్యూనిటీలోని కుటుంబాలన్నీ తర, తమ భేదాలు మరిచి న్యూ ఇయర్ వేడుకల్లో పాల్గొంటున్నారు. దీంతో కొత్త ఏడాది జోష్ మరింత పెరుగుతోంది. పురుషులు, మహిళలు, చిన్నారులు విడివిడిగా, కలివిడిగా కార్యక్రమాలు రూపొందించుకుని సంబరాలు జరుపుకుంటూ కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతున్నారు. పాత మిత్రులు, ఫ్యామిలీ ఫ్రెండ్స్ గెట్ టూ గెదర్లు ఏర్పాటు చేసుకుని ఇండోర్ గేమ్స్, అంత్యాక్షరులతో సంతోషంగా గడుపుతున్నారు. మహిళలు కొత్త ఏడాదికి స్వాగతం పలికేందుకు డిసెంబరు 31 సాయంత్రం నుంచే తమ ఇళ్ల ముందు అందమైన రంగులతో ముగ్గులు వేయడంలో తలమునకలైపోయారు.

ఆంగ్ల సంవత్సరాది క్రైస్తవ సోదరులకు చాలా ప్రత్యేకమైనది. క్రిస్మస్ వేడుకలకు ఇచ్చినంతగా న్యూ ఇయర్ వేడుకలకు వారు ప్రాధాన్యమిస్తారు. కుటుంబ సభ్యులతో కలిసి చర్చిలకు వెళ్లి రాత్రంతా ఆధ్యాత్మిక చింతనలో గడుపుతారు. అక్కడే కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుని సందడి చేస్తారు.


మందుబాబుల హడావుడి

న్యూ ఇయర్ వేడుకల్లో మందుబాబుల హడావుడి అంతా ఇంతా కాదు. కొత్త ఏడాది స్వాగత వేడుకల్లో అందరిదీ ఒక ఎత్తైతే.. మందుబాబులది ఒక ఎత్తు. వారం పదిరోజుల ముందు నుంచే వారు సిట్టింగుల కోసం ఏర్పాట్లు చేసుకున్నారు. డిసెంబరు 31వ తేదీ సాయంత్రానికే ఆత్మీయులు, మిత్రులు అందరూ ఒకచోటికి చేరి మందు, చిందులతో సందడి చేసుకోవడం మొదలుపెట్టారు.




దుకాణాల్లో ఏర్పాటుచేసిన కేకులు

కోటయ్యస్వామి చెంతకు చంద్రబాబు ఆరోసారి



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

కోటప్పకొండ కోటయ్య స్వామి సన్నిధికి చంద్రబాబు రావడం ఇది ఆరోసారి. కోటప్పకొండ అభివృద్ధిలో ఆయన కీలక పాత్ర పోషించారు. నవ్యాంధ్రప్రదేశ్ తొలి శాసన సభాపతి డాక్టర్ కోడెల శివ ప్రసాదరావు కోటప్పకొండ అభివృద్ధికి విశేషంగా కృషి చేసి భక్తుల ప్రశంసలందుకున్నారు. కోటప్పకొండ అభివృద్ధికి కోడెల ప్రతిపాదించిన ప్రతి అభివృద్ధి కార్యక్రమానికి వెనువెంటనే ముఖ్యమంత్రిగా చంద్రబాబు పెద్దఎత్తున నిధులు కేటాయించారు. కోటప్పకొండ పుణ్య క్షేత్రంగా.. పర్యాటకేంద్రంగా అభివృద్ధి చెందింది. కోటప్పకొండ తెలుగుదేశం ప్రభుత్వం హయాంలోనే అభివృద్ధి చెందింది. కోటప్పకొండకు ఘాట్ రోడ్డు నిర్మాణానికి అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు శంకుస్థాపన చేశారు. తెలుగుదేశం ప్రభుత్వమే ఘాట్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయగా సీఎం చంద్రబాబు దీనిని ప్రారంభించారు. ఘాట్ రోడ్డులో పర్యాటక కేంద్రం నిర్మించారు. కోటయ్య స్వామి ఆలయం జీర్ణోద్ధరణ పనులను చంద్రబాబు ప్రారంభించారు. ఆలయ నిర్మాణం చేసి మహాకుంభాభిషేకానికి కూడా చంద్రబాబు హాజరయ్యారు. 2014 - 2019 మధ్య సీఎంగా ఉన్న చంద్రబాబు పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు.. శంకుస్థాపనలకు రెండు సార్లు కోటప్పకొండకు వచ్చారు. యలమందలలో పింఛన్ కార్యక్రమానికి హాజరవుతున్న చంద్రబాబు ఆరోసారి శ్రీత్రికోటేశ్వర స్వామిని దర్శించుకోనున్నారు. ఇందుకోసం దేవదాయ శాఖ దేవస్థానంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ఏర్పాట్లను ఈవో డీ చంద్రశేఖరరావు పర్యవేక్షిస్తున్నారు.

సీఎం షెడ్యూల్ ఇలా..

యలమందల గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన షెడ్యూల్‌ను అధికారులు తెలిపారు.

- ఉదయం 10.30 గంటలకు ఉండవల్లి నివాసం నుంచి పల్నాడు జిల్లాకు బయలుదేరుతారు.
- 10.50 గంటలకు నరసరావుపేట మండలం, యలమందల గ్రామానికి చేరుకుంటారు.
- 11.00 నుంచి 11.30 వరకు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తారు.
- 11.35 నుంచి 12.35 వరకు వేదిక వద్ద గ్రామస్తులతో ముచ్చటిస్తారు.
- మధ్యాహ్నం 12.40 నుంచి 1.00 వరకు పల్నాడు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశమవుతారు
- 01.30 గంటలకు యలమందల నుంచి రోడ్డు మార్గంలో కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి దేవస్థానానికి బయలు దేరుతారు.
- 1.45 నుంచి 2.15 గంటల మధ్య చంద్రబాబు శ్రీత్రికోటేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు.
- 2.15 గంటలకు కోటప్పకొండ నుంచి బయలుదేరుతారు.
- 2.30 గంటలకు రోడ్డు మార్గంలో యలమందలలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 2.35 గంటలకు హెలిప్యాడ్ నుంచి హెలికాప్టర్‌లో ఉండవల్లిలోని తన నివాసానికి చంద్రబాబు బయలుదేరుతారు.
- 2.55 గంటలకు ఉండవల్లి నివాసానికి చేరుకుంటారు.

ఐదేళ్ల నిరాశ.. సీఎం మీదే ఆశ

- పల్నాడు అభివృద్ధిపై ప్రజల ఎదురు చూపులు
- జిల్లాపై సీఎం చంద్రబాబు వరాలు కురిపించేనా




వినుకొండ మునిసిపాల్టీలో నిలిచిపోయిన నీటి పథకం పనులు



సీఎంగా చంద్రబాబు 2018లో ప్రారంభించిన ములకలూరు వద్ద ముస్లిం బాలికల హాస్టల్



పెద తురకపాలెం వద్ద నిలిచిపోయిన ముస్లిం విద్యార్థుల రెసిడెన్షియల్ స్కూల్ భవనం



కోటప్పకొండలో నిలిపోయిన రోప్‌వే పనులు

ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా పల్నాడు జిల్లా పర్యటనకు వస్తున్నారు. ఈ సందర్భంగా సీఎం వరాల కోసం జిల్లా ప్రజలు ఎదురు చూస్తున్నారు. గత ఐదు సంవత్సరాలుగా ఒక్క అభివృద్ధి పనులు జరగక నిరాశతో ఉన్న ప్రజలకు సీఎం ఎలాంటి హామీలు ఇస్తారో అనే చర్చ జిల్లా వ్యాప్తంగా నడుస్తోంది. వైసీపీ ప్రభుత్వం హయాంలో అన్ని రంగాలు కోలుకోని విధంగా దెబ్బతిన్నాయి. అభివృద్ధి అటకెక్కింది. రైతులు.. కార్మికులు.. విద్యార్థులు అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో గాడి తప్పిన పల్నాడు జిల్లా ప్రగతిని పునరుద్ధరిస్తారన్న ఆశతో జిల్లాలో ఎంపీ, ఏడుగురు ఎమ్మెల్యే కూటమి అభ్యర్థులను రికార్డు స్థాయి మెజార్టీతో ప్రజలు గెలిపించారు. జిల్లా ప్రగతిపై చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెడతారని జిల్లా వాసులు గంపెడు ఆశలు పెట్టుకున్నారు. జిల్లాపై వరాలు కురిపిస్తారని ఆశిస్తున్నారు. జిల్లాలో సమస్యలు కోకొల్లలుగా ఉన్నా ప్రధానంగా సాగునీటి ప్రాజెక్టులే కీలక సమస్య. నాడు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రారంభించిన సాగు నీటి ప్రాజెక్టులు గత ఐదేళ్లు నిధులు లేక నిలిచిపోయాయి. చంద్రబాబు మళ్లీ సీఎం కావడంతో తాగు.. సాగు నీటి ప్రాజెక్టులు పూర్తవుతాయని రైతులు.. ప్రజలు ఆశతో ఎదురు చూస్తున్నారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

- మాచర్ల, వినుకొండ నియోజకవర్గాల ప్రజలకు అత్యంత ప్రాధాన్యత కలిగిన వరికపూడిశెల ప్రాజెక్టు వైసీపీ ప్రభుత్వ హయాంలో పథకం పనులు అడుగు కూడా ముందుకు సాగలేదు. ఈ పనులకు నాడు సీఎంగా చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారు.
- గురజాల నియోజకవర్గంలో సాగునీటి ఎద్దడి నివారణ కోసం ఏర్పాటు చేయనున్న తంగెడ, మాచవరం ఎత్తిపోతల పథకాలకు నిధుల్లేవు. దాదాపు 21,473 ఎకరాలకు సాగు నీరు అందించేందుకు ఈ పథకాలను రూపొందించారు.
- జిల్లాలో తాగు నీటి సరఫరా సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే లక్ష్యంతో ప్రకటించిన వాటర్ గ్రిడ్ పథకం నిర్మాణం నేటికీ చేపట్టలేదు. ఎంతో ఆర్భాటంగా ఈ పథకాన్ని వైసీపీ ప్రభుత్వం ప్రకటించి నిర్మాణాన్ని విస్మరించింది.
- తాగు, సాగు నీటి అవసరాల కోసం నాగార్జున సాగర్ కుడి కాలువ పరిధిలోని బుగ్గవాగు రిజర్వాయర్ సామర్థ్యం పెంచాలని దశాబ్దాలుగా జిల్లా వాసులు కోరుతున్నారు. నాడు తెలుగుదేశం ప్రభుత్వం బుగ్గవాగు అభివృద్ధికి రూ.202 కోట్లు మంజూరు చేసింది. బుగ్గవాగు సామర్థ్యంను 3.5 టీఎంసీల నుంచి 7 టీఎంసీలకు పెంచుతామని వైసీపీ ప్రభుత్వం ప్రకటించి చతికిల పడింది.
- నాగార్జున సాగర్ కుడి కాలువ ఆయకట్టులో నెలకొనే సాగునీటి సంక్షోభం నివారణకు గోదావరి పెన్నా నదుల అనుసంధానంలో భాగంగా తొలిదశలో గోదావరి జలాలను కుడికాలువకు తరలించేందుకు నాడు టీడీపీ ప్రభుత్వం పథకం రూపొందించింది. ఈ పథకానికి వైఎస్ఆర్ పల్నాడు కరువు నివారణ పథకంగా పేరు మార్చిన వైసీపీ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా నిధులు విడుదల చేయలేదు. నదుల అనుసంధానంలో భాగంగా గోదావరి జలాలు కుడికాలువకు తరలింపు పనులు 2026 జూన్ కల్లా పూర్తి చేస్తామని సీఎం ఇటీవల ప్రకటించడంతో ఈ పథకంపై అన్నదాతల్లో ఆశలు చిగురించాయి.
- కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనాలను పాడు పెట్టారు. ముస్లిం మైనార్టీ విద్య కోసం వెచ్చించిన రూ.8.12 కోట్లు నిరుపయోగంగా మారాయి. బాలికల వసతి గృహాన్ని నాడు సీఎం చంద్రబాబు ప్రారంభించారు. నరసరావుపేట మండలం ములకలూరు వద్ద నిర్మించిన బాలుర, బాలికల వసతి గృహాలు, ఐటీఐ కళాశాలను వినియోగంలోకి తీసురాలేదు.
- ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి సన్నిధికి తెలుగుదేశం ప్రభుత్వం చేపట్టిన రోప్‌వే నిర్మాణం నిలిచిపోయింది. ఈ పథకానికి నాడు సీఎం చంద్రబాబు 2018 ఫిబ్రవరి 17న శంకుస్థాపన చేశారు.

పర్యాటక శాఖ ఆధ్వర్యంలో రూ.6.82 కోట్ల నిధులు మంజూరు చేసి రోప్‌వే నిర్మాణ పనులను నాడు ప్రారంభించారు. ఈ పనులను వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిలిపివేసింది. ప్రభుత్వం ఇటీవల నూతన పర్యాటక పాలసీని ప్రకటించింది. పర్యాటక కేంద్రాలు, ప్రముఖ దేవాలయాల అభివృద్ధికి ప్రణాళికను విడుదల చేసింది. నూతన పాలసీలో కోటప్పకొండకు చోటు దక్కలేదు. కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వరస్వామి సన్నిధిలో మహాశివరాత్రి సందర్భంగా జరిగే తిరునాళ్ల దేశ ప్రసిద్ధి. తిరునాళ్లకు రాష్ట్ర పండగ హోదాను ప్రభుత్వం కల్పించింది. దీనికి ప్రత్యేకంగా నిధులు కేటాయింపు ఏటా జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

- నరసరావుపేట జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలకు కాకినాడ జేఎన్‌టీ యూనివర్సిటీ అధ్యాపకులను నియమించలేదు. అతిథి అధ్యాపకులతో కాలం గడుపుతుండటంతో విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. 2018 డిసెంబరులో టీడీపీ ప్రభుత్వం కళాశాలకు 80 అధ్యాపక పోస్టులను మంజూరు చేసింది. ఇందుకు సంబంధించి రూ. 7.11 కోట్ల వార్షిక బడ్జెట్‌ను నాడు కేటాయించింది. తొమ్మిది మంది ప్రొఫెసర్‌లు, 53 అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు, 18 అసోసియేట్ ప్రొఫెసర్‌లను కళాశాలకు మంజూరు చేస్తూ జీవోను విడుదల చేసింది. ఈ మేరకు అధ్యాపకులను యూనివర్సిటీ నేటికీ నియమించలేదు. 73 మంది అధ్యాపకుల కొరత ఉంది. నామమాత్రంగా కాంట్రాక్ట్ అధ్యాపకులను నియమించి వర్సిటీ చేతులు దులుపుకుంది.



నరసరావుపేట మార్కెట్ యార్డులో నిలిపిపోయిన శీతల గోదాము



అసంపూర్తిగా నిర్మించిన నరసరావుపేట జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల భవన సముదాయం

బీసీ వసతిగృహాల్లో.. డిజిటల్ పాఠాలు

- వారం రోజుల్లో ప్రారంభానికి సన్నాహాలు
- సబ్జెక్టుల వారీగా బోధన

గుంటూరు(విద్య), డిసెంబరు 30 (ఆంధ్ర జ్యోతి): ఉమ్మడి జిల్లాలోని బీసీ సంక్షేమశాఖ హాస్టల్స్‌లో డిజిటల్ తరగతులు ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా తొలి విడత ఉమ్మడి జిల్లాలో నాలుగు హాస్టల్స్‌లో బోధనకు ప్రభుత్వ ప్రణాళికలు సిద్ధం చేయగా ఇప్పటికే డిజిటల్ స్క్రీన్స్, ఇతర సాంకేతిక పరికరాలు జిల్లాకు వచ్చాయి. తొలి విడతగా తాడికొండ, పెదకాకాని, చేబ్రోలు, అన్నపర్రులో డిజిటల్ తరగతులు ప్రారంభం కానున్నాయి. తరువాత క్రమంగా అన్ని హాస్టల్స్‌లో ఇవి ఏర్పాటు చేయనున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 54 హాస్టల్స్ ఉన్నాయి. ఇందులో 43 బాలుర కోసం మరో 11 బాలికల కోసం కేటాయించారు. ఆయా హాస్టల్స్‌లో దాదాపు 5వేలమందికి పైగా విద్యార్థిని విద్యార్థులు 3వ తరగతి నుంచి పదవ తరగతి వరకు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఇందులో పదవ తరగతి చదివే విద్యార్థులు 800 పైగా ఉన్నారు. ఆయా విద్యార్థులకు గణితం, ఆంగ్లం, హిందీ, సైన్స్ తదితర సబ్జెక్టుల్లో మెరుగైన బోధన అందించడమే లక్ష్యంగా ఈ డిజిటల్ తరగతులు ప్రారంభం కానున్నాయి.



డిజిటల్ స్క్రీన్

నిర్లక్ష్యాన్ని వదిలి డిజిటల్ వైపు అడుగులు....

బీసీ సంక్షేమహాస్టల్స్ వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురి అయ్యాయి. విద్యార్థులకు కనీస వసతులు కల్పించడంలో విఫలం అయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. విద్యార్థులకు ఇవ్వాల్సిన కాస్మోటిక్స్ చార్జీల చెల్లింపు, నెలనెలా డైట్‌చార్జీల చెల్లింపు తీవ్రజాప్యం చేశారు. కొన్ని హాస్టల్స్‌లో వార్డెన్లు అప్పులుచేసి భోజనం పెట్టాల్సిన దుస్థితి నెలకొంది. హాస్టల్‌లో రాత్రి పూట విద్యార్థుల్ని చదివించడానికి 2019కి ముందు ప్రత్యేకంగా ట్యూటర్‌ను నియమించేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ట్యూటర్స్ నియామకం అటకెక్కింది. తాజాగా ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పదిలో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా బోధకుల్ని నియమించాలని యోచిస్తున్నారు. పాఠశాల నుంచి వచ్చిన తరువాత హాస్టల్ ఈ డిజిటల్ క్లాసులు ప్రారంభిస్తారు. సబ్జెక్టుల వారీగా బోధనతోపాటు సందేహాలు నివృత్తిచేస్తారు. ఇందు కోసం హాస్టల్‌లో ప్రత్యేకంగా ఒక గదిని కేటాయించి అక్కడ ఇంటరాక్టివ్ ప్యానల్ బోర్డు ఏర్పాటుచేస్తారు. బోధించే ట్యూటర్‌కు గౌరవ వేతనంగా రూ. 1500 నుంచి రూ.2వేలు ఇచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బీసీ సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్న నేపథ్యంలో కొత్తగా ఏర్పాటు అయ్యే ఈ డిజిటల్ క్లాసుల ఏర్పాటుకు ప్రత్యేక కసరత్తు చేస్తున్నారు.

నీటి తొలగింపు పనులు ముమ్మరం



నీటిని తొలగించేందుకు ఏర్పాటు చేసిన భారీ మోటార్లు

గుంటూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలోని శాశ్వత సచివాలయ భవనాల పునాదుల్లో నిలిచిపోయిన నీటిని తొలగించే కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. నాలుగు రోజుల క్రితం ప్రారంభమైన నీటి తొలగింపు కార్యక్రమాన్ని సీఆర్డీఏ అధికారులు మరింత ముమ్మరం చేశారు. సాధ్యమైనంత త్వరగా సెక్రటేరియట్ భవన సముదాయ పునాదుల నుంచి నీటిని తొలగించేందుకు వీలుగా భారీ మోటార్లను తెప్పించి నీటిని తోడుతున్నారు. భారీ మోటార్లు నిరంతరాయంగా పనిచేస్తున్నా నీరు తరగడం లేదు. దీంతో మరిన్ని మోటార్లు తెప్పించి నీటిని తోడివేయించాలన్న యోచనలో సీఆర్డీఏ అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది.

వైసీపీ రద్దు చేసిన 16 గిరిజన సంక్షేమ పథకాలు పునరుద్ధరించండి

- సీఎం చంద్రబాబుకు ధారూనాయక్ వినతి

గుంటూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన 16 గిరిజన సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎం ధారూనాయక్ సీఎంను కోరారు. ఈ మేరకు సోమవారం రాత్రి ఆయన సచివాలయంలో సీఎం చంద్రబాబును కలసి వినతి పత్రం అందించారు. గత వైసీపీ ప్రభుత్వం గిరిజనులను వంచించిందని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన సంక్షేమ పథకాలు రద్దు చేయడంతో గిరిజనులు విద్య, ఉద్యోగ, ఉపాధి, సంక్షేమ రంగాల్లో తీవ్రంగా నష్టపోయారన్నారు. వారి జీవన విధానంపై తీవ్ర ప్రభావం చూపిందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే గిరిజనుల ఆర్థికాభివృద్ధి జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో గత వైసీపీ ప్రభుత్వంలో గిరిజనులకు జరిగిన ద్రోహాన్ని వారు జీవితాంతం మరువలేరన్నారు. ఇందుకు స్పందించిన సీఎం చంద్రబాబు ఆయా పథకాలను పునరుద్ధరించి గిరిజనులను అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.



సచివాలయంలో సీఎం చంద్రబాబుకు గిరిజన సమస్యలు వివరిస్తున్న ధారూనాయక్

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

సమస్యలపై ఎర్ర చందనం వ్యాపారుల వినతి

మంగళగిరి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రెడ్ శాండర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎర్ర చందనం వ్యాపారులు, రైతులు సోమవారం మంగళగిరిలోని అటవీ శాఖ ప్రధాన కార్యాలయంలో అటవీ సంరక్షణ ముఖ్యఅధికారి చిరంజీవి చౌదరిని కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఇతర రాష్ట్రాల్లో లేని నిబంధనలు మన రాష్ట్రంలో అమలవుతున్నాయని, ఈ నిబంధనలను సరళీకరించాలని విజ్ఞప్తి చేశారు. ఇతర సమస్యలను ప్రస్తావిస్తూ వినతిపత్రం అందించారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని పీసీసీఎఫ్ చిరంజీవి చౌదరి తెలిపారు. కార్యక్రమంలో రెడ్ శాండర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ రవిరాజు, కార్యదర్శి నాగయ్య, సంయుక్త కార్యదర్శి కొండేటి ఆంజనేయులు, వ్యాపారులు, రైతులు, కొయ్య పని కళాకారులు పాల్గొన్నారు.

నేడు పెన్షన్‌ల పంపిణీ

కాకుమాను, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా జనవరి సామాజిక పెన్షన్‌లు మంగళవారం అన్ని గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో యుగకీర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అప్పాపురంనకు నోడల్ అధికారిగా ఎంఈవో కెన్నడీ, భల్లఖానుడువారిపాలెంకు పీఆర్ ఏఈ రవీంద్రారెడ్డి, బోడిపాలెంలకు ఈవోపీఆర్డీ రవికుమార్, చిన్నలింగాయపాలెంకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకాయమ్మ, గరికపాడుకు విద్యుత్ శాఖ ఏఈ మౌలాలిఖాన్, గార్లపాడుకు హౌసింగ్ ఏఈ మారుతీరావు, కాకుమాను-1కు ఎంపీడీవో యుగకీర్తి, కాకుమాను-2 సచివాలయంకు ఎంఈవో-2 కేవీ భాస్కరరావు, కొమ్మూరుకు ఏపీఎం సుజాత, కొండపాటూరుకు ఏవో కిరణ్మయి, పాండ్రపాడుకు ఏపీవో సింగారావు, రేటూరుకు ఇరిగేషన్ ఏఈ రత్నకిషోర్, వల్లూరుకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్‌లను నియమించినట్లు ఎంపీడీవో తెలిపారు.

శివాలయంలో హుండీల లెక్కింపు

మంగళగిరి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానం, మిద్దె సెంటర్లోని శ్రీప్రపత్తి ఆంజనేయ స్వామి దేవస్థానంలో హుండీలను సోమవారం లెక్కించారు. శివాలయంలో 15 నెలలకు గాను రూ.12,44,454లు వచ్చిందని, గతంలో 8 నెలలకు గాను రూ.5,53,864లు వచ్చిందని ఈవో జేవీ నారాయణరావు తెలిపారు. ఆంజనేయ స్వామి దేవస్థానంలో 15 నెలలకు గాను రూ.లక్షా 44 వేల 845లు వచ్చిందని, గతంలో 19 నెలలకు గాను రూ.లక్షా 55 వేల 517లు వచ్చిందని వెల్లడించారు. హుండీల లెక్కింపును దేవదాయ శాఖ పర్యవేక్షణాధికారి జీ.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

పోలేరమ్మ హుండీల ఆదాయం రూ.5.18 లక్షలు

కాకుమాను, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని కొండపాటూరులో కొలువై ఉన్న స్వయంభు శ్రీపోలేరమ్మ హుండీల ఆదాయం లెక్కింపు కార్యక్రమం సోమవారం ఆలయం ఎదురుగా ఉన్న ఆలయ మండపంలో బాపట్ల దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ గోపి ఆధ్వర్యంలో నిర్వహించారు. మూడున్నర నెలల నుంచి వచ్చిన ఆదాయం రూ.5,18,468గా వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి బీ సురేష్ తెలిపారు. హుండీల లెక్కింపు కార్యక్రమంలో ఆలయ అర్చకుడు నాగేశ్వరరావు, స్థానిక నాయకులు పొన్నం శ్రీనివాసరావు, యర్రాకుల దానయ్య, తోట నరేంద్ర, మండవ రవి, సాంబయ్య, భారత స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు చెందిన బాపారావు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలని వినతి

మంగళగిరి సిటీ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): క్లాప్ ఆటో డ్రైవర్లకు పెండింగ్ జీతాలు చెల్లించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యూనియన్ నేతలు సోమవారం ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషాకు వినతిపత్రం అందజేశారు. రెండు నెలల నుంచి వేతనాలు చెల్లించకపోవడంతో ఆటో డ్రైవర్ల కుటుంబాలు ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నాయని, వెంటనే జీతాలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు రాఘవులు, బీ వెంకటేశ్వరరావు, శివ, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద విగ్రహం తొలగింపు

తాడేపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం ఇప్పటంలో సోమవారం స్వామి వివేకానంద విగ్రహాన్ని ఎంటీఎంసీ సిబ్బంది కమిషనర్ ఆదేశాల మేరకు తొలగించారు. ఇటీవల ఎంటీఎంసీ కమిషనర్‌కు తొలగింపు ప్రక్రియను ఆపాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేసినా సిబ్బంది సోమవారం విగ్రహాన్ని తొలగించడం అన్యాయమన్నారు. జనవరి నెల 12వరకు తొలగింపు ప్రక్రియ ఆపాలని ఆరోజు స్వామి వివేకానంద పుట్టినరోజని, గ్రామస్థులు కోరినా సిబ్బంది తొలగించారు. ఈ చర్యపై ఇప్పటం గ్రామస్థులు మండిపడుతున్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రత్తిపాడు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండల విద్యావనరుల కేంద్రంలో యూటీఎఫ్ క్యాలెండర్, సిక్కర్స్ ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం జరిగింది. ఎంఈవో రమాదేవి చేతుల మీదుగా ఈ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అంతేగాకుండా పాకెట్ డైరీని కూడా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమములో యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి జీ రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం కళాధర్, జిల్లా కార్యవర్గ సభ్యులు జీ చంద్రశేఖర్ రెడ్డి, కేవీ నారాయణ, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 252 మందికి ఉద్యోగాలు

మంగళగిరి సిటీ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన, సీడాప్ ఆధ్వర్యంలో సోమవారం మంగళగిరి గణపతి నగర్‌లోని వీజే డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించారు. 770 మంది యువతీ, యువకులు రిజిస్ట్రేషన్ చేసుకోగా, 252 మంది వివిధ కంపెనీలలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ ప్రెగడ రాజశేఖర్ మాట్లాడుతూ డిగ్రీ పూర్తయ్యాక ఉద్యోగాన్వేషణలో ఉన్న యువత ఏ కంపెనీలో చేరాలన్నా సాధారణంగా ఉద్యోగ అనుభవం అడుగుతారని, ఈ పరిస్థితుల్లో జాబ్‌మేళా వంటివి వారికి ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధి కల్పన జేఈవో కే.రమాదేవి, వైపీ మల్లేశ్వరీ, డీఎస్‌డీవో కే.సంజీవరావు, డీపీవో పీ.ఈశ్వర్, సీడాప్ మేనేజర్ శివప్రసాద్ రెడ్డి, వీజే కళాశాల ప్రిన్సిపాల్ నాదెళ్ల శ్రీనివాసరావు, వైస్‌ప్రిన్సిపాల్ లక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

31 రాత్రి అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

దుగ్గిరాల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): 31వ తేదీ రాత్రి మద్యం తాగి వాహనం నడిపితే రూ.1500 జరిమానా విధిస్తామని ఎస్ఐ ఎస్ వెంకటరవి హెచ్చరించారు. ద్విచక్రవాహనాలపై ముగ్గురు ప్రయాణించినా, సైలెన్సర్ తొలగించి శబ్దకాలుష్యం చేస్తూ, ప్రజలను ఇబ్బందులకు గురిచేసినా కేసులు నమోదు చేస్తామన్నారు. గుంపులుగా ఒకచోట చేరడం, బాణసంచా కాల్చినా కఠినచర్యలు తప్పవన్నారు. నూతన సంవత్సర వేడుకలు ప్రశాంత వాతావరణంలో ఆనందంగా జరుపుకోవాలని సూచించారు.

అర్ధరాత్రి వేడుకలకు అనుమతుల్లేవు

తాడికొండ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి నూతన సంవత్సర వేడుకలకు అనుమతులు లేవని తాడికొండ సీఐ కే వాసు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నూతన సంవత్సరం వేడుకల పేరుతో ప్రజలు అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. డ్రంక్ అండ్ డ్రై కేసులపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, డ్రైవింగ్ లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. పోలీస్ యాక్ట్ సెక్షన్ 30, సెక్షన్ 144 అమల్లో ఉందని తెలిపారు. మండల పరిధి గ్రామాల్లో పోలీసులు బందోబస్తు నిర్వహిస్తారని తెలిపారు.

ప్రమాదకరంగా చినకోండ్రుపాడు చప్టా

- శిథిలమై పోయి.. భారీ వాహనాలు వెళ్లే దారి లేక
- 25 కిలోమీటర్లు చుట్టూ తిరిగివెళుతున్న తీరు



పగిలిపోయి ప్రమాదకరంగా ఉన్న చప్టా

ప్రత్తిపాడు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు నుంచి చినకోండ్రుపాడు మీదుగా జాతీయ రహదారిని కలిపే రోడ్డులో రామవాగుపై ఉన్న చప్టా పూర్తిగా శిథిలమై పోయింది. ఈ చప్టాకు అతుకులు వేస్తూ పాలకులు కాలం వెల్లదీస్తున్నారు తప్ప దీనిని పునర్నిర్మిద్దాం అనే ఆలోచన ఇంతవరకు చేయలేదు. గత వైసీపీ పాలనలో రోడ్లు, చప్టాలను నిర్లక్ష్యం చేశారు. ఈ రహదారి గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో ఇప్పుడు ఈ వంతెన పూర్తిగా ఛిద్రమై పోయి వాహన రాకపోకలకు ఆటంకంగా మారింది. ప్రత్తిపాడు నుంచి చినకోండ్రుపాడు మీదుగా జాతీయ రహదారికి సుమారు ఐదు కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈ రహదారి పూర్తిగా నరక ప్రాయంగా మారింది. గత తెలుగుదేశం పార్టీ హయాంలో ఈ రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టి టెండర్లు కూడా పిలిచారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ టెండర్లను రద్దు చేసింది. తరువాత ఈ రహదారి గురించే పట్టించుకున్న దాఖలాలు లేవు. గతంలో కురిసిన భారీ వర్షాలకు ఈ చప్టాపై నుంచి నీళ్లు పొంగి పొర్లడంతో పాటు ఒక పక్క చప్టా పూర్తిగా కొట్టుకుపోయింది. తాత్కాలికంగా మరమ్మతులు చేసి వదిలి పెట్టారు. దీంతో బిక్కుబిక్కు మంటూ ప్రయాణం సాగించాల్సి వస్తుంది. ఏ మాత్రం ఆదమరిచినా అంతే సంగతి అన్నట్టుగా ఉంటుంది.

ఈ రహదారి ప్రత్తిపాడు ప్రాంతానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. జాతీయ రహదారి చేరుకోవాలంటే కేవలం ఐదు కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తే సరిపోతుంది. నిత్యం జాతీయ రహదారిపై ఉన్న కంపెనీలతో పాటు కేఎంసీ వంటి వైద్యశాలలకు వెళ్లే ప్రయాణికులు ఈ రహదారి మీదుగానే ప్రయాణం సాగిస్తుంటారు. అంతే కాకుండా ప్రస్తుతం ఈ రోడ్డు పారిశ్రామికంగా కూడా అభివృద్ధి చెందుతుంది. ఇప్పటికే పలు రకాల కంపెనీలు ఈ రహదారిలో నెలకొల్పారు. దీంతో భారీ వాహనాలు కూడా ఈ రహదారి గుండా ప్రయాణం చేస్తున్నాయి. అలాంటి రహదారిలో ఉన్న బ్రిడ్జితో పాటు రోడ్డు సరిగా లేకపోవడంతో 25 కిలోమీటర్ల మేర గుంటూరు నుంచి తిరిగి రావాల్సి వస్తుంది. ఈ రహదారి కాకుండా ప్రత్యామ్నాయంగా గొట్టిపాడు, బోయపాలెం మీదుగా, తిక్కిరెడ్డిపాలెం, యనమదల మీదుగా కూడా జాతీయ రహదారి చేరుకోవచ్చు. కానీ ఈ రహదారులు కూడా పూర్తిగా ఛిద్రమైపోయి ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ఈ బ్రిడ్జి నిర్మాణంతో పాటు రోడ్డు నిర్మాణం జరిగితేనే ప్రజలకు మేలు జరుగుతుంది. దీనిపై పాలకులు చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై వామపక్షాల నిరసన



మంగళగిరిలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వామపక్ష నేతలు

మంగళగిరి సిటీ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్ ఆధ్వర్యంలో సోమవారం మంగళగిరి తాలూకా సెంటర్లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, సీపీఐ ఎంఎల్ నేత కూరపాటి కోటేశ్వరరావు మాట్లాడుతూ అమిత్ షా వ్యాఖ్యలు మనువాద సిద్ధాంతాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా ఉన్నాయన్నారు. దేశ సమైక్యతకు, సమగ్రతకు నష్టం కలిగించేలా కేంద్రంలోని బీజేపీ విధానాలు ఉన్నాయని విమర్శించారు. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వామపక్ష పార్టీల నేతలు చిన్ని తిరుపతయ్య, అన్నవరపు ప్రభాకర్‌రావు, రాఘవులు, బాలకృష్ణ, జవహర్‌లాల్, యూ దుర్గారావు, బాలాజీ, చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

● **తాడేపల్లి** : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా అవహేళన చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని సీపీఎం జిల్లా నాయకులు జొన్నా శివశంకర్ డిమాండ్ చేశారు. సోమవారం ఎంటీఎంసీ పరిధిలోని ప్రాతూరు జాతీయ రహదారి వద్ద సీపీఎం శ్రేణులు అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసన చేపట్టారు.

● **తాడేపల్లి టౌన్**: తాడేపల్లి ఎంటీఎంసీ కార్యాలయం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీఎం, సీపీఐ, సీపీఐ ఎంఎల్ ఆధ్వర్యంలో నేతలు కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు.

● **దుగ్గిరాల** : స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట సీపీఎం నాయకులు నిరసన ప్రదర్శన చేపట్టారు.

● **ఫిరంగిపురం**: ఫిరంగిపురంలో గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు అంబేద్కర్ చిత్రపటాలను, సీపీఎం జెండాలను పట్టుకొని ప్రదర్శన చేశారు.

● **తాడికొండ** : తాడికొండ అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీఎం, సీపీఐలు అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై సోమవారం ఆందోళన చేపట్టాయి. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్ గురించి అమిత్‌షా అనుచితంగా మాట్లాడటం సరికా దన్నారు.

● **తుళ్లూరు** : తుళ్లూరులో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించిన అనంతరం సీపీఎం నేతలు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి, భాగ్యరాజ్, జొన్నకూటి నవీన్, వల్లబాపురం వెంకటేశ్వరావు, టి.అనురాధ, స్వరంతి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సహకారంతో మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న జయసత్య, భూలక్ష్మి తదితరులు

మంగళగిరి సిటీ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ వనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేశ్ మంగళగిరిలో అమలు చేస్తున్న స్త్రీశక్తి కార్యక్రమం ద్వారా మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు అందజే శారు. స్త్రీశక్తి 67వ బ్యాచ్‌లో దుగ్గిరాల మండలానికి చెందిన 30 మంది మహిళ లు రెండు నెలలపాటు కుట్టు శిక్షణ పూర్తిచేసుకున్నారు. వీరికి మంత్రి లోకేశ్ సహకారంతో సోమవారం మంగళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో ఉచితంగా కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా తెలుగుమహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య మాట్లాడుతూ నైపుణ్యం కలిగివుండి ఆర్థిక పరిస్థితులు సహకరించక ఇంటికే పరిమితమైన మహిళలకు మంత్రి నారా లోకేశ్ స్త్రీ శక్తి ద్వారా శిక్షణ ఇప్పించి, ఉపాధి అవకాశాలను చూపుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో తెలుగుమహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మి, టీడీపీ దుగ్గిరాల మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, చిలువూరు ఎంపీటీసీ మరియ రోజమ్మ, వింజమూరి ఆశాబాల, ఉమాదేవి భాయి, యలమంచిలి పద్మజ, వాసా పద్మ, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు తోపుడు బండ్ల పంపిణీ

తుళ్లూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ జొన్నలగడ్డ కిరణ్‌కుమార్ తోపుడు బండ్లను 18 మంది చిరు వ్యాపారులకు సోమవారం పంపిణీ చేశారు. మంత్రి నారా లోకేశ్ స్ఫూర్తితో పేదలకు పార్టీ తరుపున అండగా ఉండాలనే ఉద్దేశంతో మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు 120 తోపుడు బండ్లు అందజేసినట్టు కిరణ్ తెలిపారు. పేదలకు కూడు గుడ్డ, నీడ అందించాలని స్వర్గీయ ఎన్టీఆర్ స్ఫూర్తితో పార్టీ నాయకులు పని చేస్తున్నారన్నారని, ఎన్టీఆర్ ఆశయ సాధన కోసం సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని కిరణ్ చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు బండ్ల పట్టాభిరామయ్య, జమ్ముల అనిల్, జమ్ముల హరికిరణ్(బాబి), గడ్డం వెంకటేశ్వరావు, కొల్లి నరేంద్ర, నేలపాటి శ్రీనివాసరావు, పాటిబండ్ల జయకృష్ణ, మూల్పూరి రాంబాబు, జెట్టి రమేష్, భూక్యా గోపి నాయక్, రూపావత్ విజయ్, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.



చిరు వ్యారులకు తోపుడు బండ్లు అందజేస్తున్న టీడీపీ నేతలు

మహాభారతం నుంచి జీవిత పాఠాలు నేర్చుకోవాలి

● ప్రవచనకర్త మంచికంటి వెంకటేశ్వరరావు



విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న మంచి కంటి వెంకటేశ్వరరావు

తాడేపల్లి టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ప్రవచనకర్త, ఆధ్యాత్మికవేత్త మంచికంటి వెంకటేశ్వరరావు సోమవారం కేఎల్ యూనివర్సిటీలో లిపి డాట్ గేమ్ యాప్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ నేటితరం యువతీ యువకులు మహాభారతం నుంచి జీవిత పాఠాలు నేర్చుకోవాలని సూచించారు. లిపి డాట్ గేమ్ మన భారతీయత మన మహాభారతం అనే నినాదంతో 2025లో తెలుగు వారందరికి ఆడియోల రూపంలో మహాభారతాన్ని అందుబాటులోకి తీసుకువస్తుందన్నారు. ఈ యాప్‌లో పిల్లలు, యువత, పెద్దలు అందరూ మహాభారతం తెలుసుకునే విధంగా చిన్న చిన్న కథలు, వివరణాత్మక కథలు, వినసొంపుగా తీర్చిదిద్దారన్నారు. కేఎల్‌యూ వీసీ డాక్టర్ సారధివర్మ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు టెక్నాలజీని జోడించి సమాజానికి అందించడం అభినందనీయమన్నారు. లిపి డాట్ గేమ్ యాప్ డైరెక్టర్ చాగంటి ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ యాప్ ద్వారా మాతృభాషపై పట్టు సాధించ వచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో సింగరాజు, చాగంటి ప్రసాద్, ప్రో వీసీ డాక్టర్ ప్రసాద్, రిజిస్ట్రార్ కే సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగ డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, శాక్ డైరెక్టర్ పీ సాయి విజయ్, లక్ష్మి, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏఐ టెక్నాలజీలో నైపుణ్యం తప్పనిసరి

● ఐనాస్ టెక్నాలజీస్ ప్రతినిధులు హరీష్, నవీన్

తాడికొండ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించాలంటే ఏఐ టెక్నాలజీలో నైపుణ్యం తప్పనిసరి అని ఐనాస్ టెక్నాలజీస్ ప్రతినిధులు హరీష్, నవీన్ పేర్కొన్నారు. సోమవారం మోతడక చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో ఐబీఎం స్కిల్స్ బిల్డ్ కార్యక్రమాన్ని హైదరాబాద్‌కు చెందిన ఐనాస్ టెక్నాలజీస్ సంస్థ నిర్వహించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏఐ టెక్నాలజీ నేర్చుకోవటంతో పాటు, ప్రతి రోజు మెరుగు పరుచుకుంటూనే ఉండాలని అన్నారు. సాఫ్ట్‌వేర్ రంగంలోకి ప్రవేశించే వారు ఏఐ టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలన్నారు. రానున్న రోజుల్లో ఏఐ టెక్నాలజీకి ఆదరణ లభిస్తుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే నాగ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు, అధ్యాపకులకు విలువైన కొత్త నైపుణ్యాలను అభివృద్ధి చేయడం, కేరీర్ అవకాశాలను పెంపొందించుకోవటంలో సహాయ పడుతుందన్నారు. విద్యార్థులందరూ ఐబీఎం కాగ్నిటివ్ తరగతులను పూర్తి చేయడం ద్వారా ఉచిత బ్యాడ్జ్‌లు, సర్టిఫికెట్లను సంపాదించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డీన్స్ పీ ఫణికుమార్, పీ బాలమురళి కృష్ణ, వీవీ సుబ్బారావు, వివిధ శాఖాధిపతులు జీ రామచంద్రరావు, ఎస్ శాంతి, వీ సాయి శ్రీనివాస్, డీ కళ్యాణ్‌కుమార్, పీ రత్నబాబు, డీ నాగ రవికిరణ్, కే వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారుల వేధింపుల నుంచి రక్షణ కల్పించాలి

తెనాలి అర్బన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వడ్డీ వ్యాపారుల వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని ఇందిరానగర్ కాలనీకి చెందిన ఎస్టీలు సోమవారం సబ్ కలెక్టర్ సంజనా సింహాకు వినతిపత్రం అందించారు. అవసరాల నిమిత్తం వడ్డీ వ్యాపారి అంగిరేకుల నాగరాజు వద్ద రూ.3 లక్షలు తీసుకుంటే ఇప్పటి వరకు రూ.18లక్షల వడ్డీ వేశారని వాపోయారు. ఇంకా రూ.10లక్షలు కట్టాలంటూ వేధిస్తున్నారని చెప్పారు. డబ్బులు కట్టకపోతే ఇళ్లు ఖాళీచేసి వెళ్లిపోవాలని దౌర్జన్యం చేస్తున్నారని కొమరగిరి మాణిక్యమ్మ ఆమె కుటుంబ సభ్యులు సబ్ కలెక్టర్ తమ గోడు వెళబోసుకున్నారు. విచారించి చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి

పొన్నూరు టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి పదవికి అమిత్ షా తక్షణమే రాజీనామా చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దండా లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో జాతీయ వామపక్షాల పిలుపు మేరకు సీపీఐ, సీపీఎం అనుబంధ సంఘాలు ధర్నా నిర్వహించాయి. ముఖ్యఅతిథిగా హాజరైన లక్ష్మీనారాయణ మాట్లాడుతూ భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా తక్షణమే రాజీనామా చేయాలని, ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఆరేటి రామారావు, మాల మహా సభ నాయకులు, చైతన్య టీఎస్పీ నాయకులు కిషోర్ బాబు, గేయ రచయిత దేవరకొండ శ్రీనివాస్, ప్రభుదాస్, నిమ్మకూరు రమేష్ బాబు, సతీష్ గోవిందరాజులు, బాజీ నాగరాజు, వీరరాఘవులు, ప్రసాద్, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

కొల్లిపర, (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానించినందుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షాను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్.భావన్నారాయణ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రం కొల్లిపరలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అంబేద్కర్‌పై అనుచితంగా మాట్లాడినందుకు ఖండిస్తూ సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకుడు ములకా శివసాంబిరెడ్డి, రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగ సంఘ నాయకుడు కొల్లి శివనాగిరెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి కోటా చంద్రశేఖర్, సీపీఎం నాయకులు గోదా సుందరరావు, మల్లోల రమేష్, కొల్లిపర కోటేశ్వరరావు, మల్లోల కుమారి, గోదా దీనమ్మ పాల్గొన్నారు.

తెనాలి అర్బన్, (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు సరికాదని సీపీఎం డివిజన్ కార్యదర్శి కె.బాబూప్రసాద్ అన్నారు. చెంచుపేట ప్రజా సంఘాల కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. హోంమంత్రి చేసిన వ్యాఖ్యలు రాజ్యాంగంపై దాడిగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో షేక్ హుస్సేన్‌వలి, రాజ్యలక్ష్మి, సాంబశివరావు, వెంకటసుబ్బయ్య, బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

నేత్ర వైద్య పరీక్షలు

పొన్నూరు టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణం నిడుబ్రోలులోని 14వ వార్డులో సోమవారం ఎల్‌వీ ప్రసాద్ కంటి హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం జరిగింది. రజకపేటలో జరిగిన శిబిరంలో 200 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో నిడుబ్రోలు టీడీపీ అధ్యక్షుడు జాగర్లమూడి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఎన్ విద్యార్థులకు
హెటిరోలో ఉద్యోగాలు

తెనాలి అర్బన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఏఎస్ఎన్ డిగ్రీ కళాశాల విద్యార్థులు 34మంది హెటిరో కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యా సంస్థల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అభినందించారు. బీఎస్సీ, బీకాం మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు రూ.2.76లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలు సాధించారన్నారు. తమ కళాశాలలో చదివే విద్యార్థులకు ఉపాధి లభించేందుకు అవసరమైన నైపుణ్యాలను కలిగిస్తున్నామన్నారు. పలు విద్యా సంస్థలు ఇప్పటివరకు ఎన్నో ప్రాంగణ ఎంపికలు నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేశారని చెప్పారు. ప్రిన్సిపాల్ కొలసాని రాంచంద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రూ.550 కోట్లకు చేరిన
కాకతీయ సొసైటీ టర్నోవర్

తెనాలి అర్బన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ కో ఆపరేటివ్ సొసైటీ టర్నోవర్ రూ.550కోట్లకు చేరిందని సొసైటీ ఛైర్మన్ డిఎల్ కాంతారావు చెప్పారు. స్థానిక కొత్తపేటలోని సొసైటీ కార్యాలయంలో కార్యవర్గ సభ్యులతో అభివృద్ధిని సమీక్షించారు. అనతి కాలంలోనే 11బ్రాంచిలకు సొసైటీ చేరేలా కార్యవర్గం కృషి చేసిందని, రూ.130కోట్లు డిపాజిట్లు సేకరించగా రూ.110కోట్లు రుణాలు మంజూరు చేశామన్నారు. ప్రతిరోజు డైలీ డిపాజిట్లు ద్వారా రూ.5లక్షలు నిధులు డిపాజిట్ అవుతున్నాయని చెప్పారు. వారం రోజులు ఖాతాదారులకు సేవలు అందిస్తున్నామని, ఆదివారం కూడా సొసైటీ పని చేస్తుందని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. సమావేశంలో షేక్ ఖలీల్, వాసుదేవనాయుడు, బ్రహ్మాచార్యులు, శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యశాస్త్రి, చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణ స్కూల్లో విజ్ఞాన ప్రదర్శన

తెనాలి అర్బన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): చెంచుపేటలోని నారాయణ హైస్కూల్‌లో సోమవారం విజ్ఞాన ప్రదర్శన నిర్వహించారు. గణిత మేధావి రామానుజన్ జయంతిని పురస్కరించుకుని విద్యార్థులు రూపొందించిన గణిత నమూనాలు ప్రదర్శించారు. వర్కింగ్ మోడల్స్, షేప్స్, లైన్స్ యాంగిల్స్, డెసిమల్ మెడల్స్, పైథాగరస్, వంటి అంశాలపై చేసిన నమూనాలు ఆకట్టుకున్నాయి. ఏజీఎం శివనాగరాజు మాట్లాడుతూ, విద్యార్థులలో సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు విజ్ఞాన ప్రదర్శనలు దోహదపడతాయన్నారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'కిశోరి వికాసం'పై శిక్షణ

కొల్లిపర, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సీడీపీవో సునీత అధ్యక్షతన కిశోరి వికాసం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన తహసీల్దార్ సిద్ధార్థ మాట్లాడుతూ బాలికలు, మహిళల ఉజ్వల భవిష్యత్తుకు కిశోరి వికాసం శిక్షణా కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని అన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులతో పాటు బాధ్యతలను కూడా పిల్లలకు తెలియజేయాలన్నారు. మహిళా సాధికారత, మహిళల అభివృద్ధికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఎంపీపీ భీమవరపు పద్మావతి మాట్లాడుతూ యువతకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగించాలన్నారు. బాల్య వివాహాలు జరుగకుండా తల్లిదండ్రులకు అవగాహన కలిగించాలని తెలియజేశారు. బాల్య వివాహాల అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, ఈవోపీఆర్డీ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కోసం రైతన్నల ఇక్కట్లు

- మార్కెట్ యార్డులో ఉదయం పేర్లు నమోదు, మధ్యాహ్నం ఎరువుల పంపిణీ
- దీంతో రోజంతా రైతన్నల పడిగాపులు
- కొరత భయంతో ముందుగానే కొనుగోళ్లు
- ఐదు బస్తాల యూరియాకి ఒక బస్తా నానో యూరియా కొనాలనే నిబంధనపై రైతుల్లో అసంతృప్తి


ఎరువులను తీసుకు వెళ్లేందుకు బారులు తీరిన ఆటోలు

తెనాలి రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): డివిజన్ వ్యాప్తంగా ఖరీఫ్ సాగు ముగిసి రబీ ప్రారంభమైంది. దీంతో ఎరువుల కోసం రైతులు ఇక్కట్లు పడుతున్నారు. ఇప్పటికే రైతులు వరి సాగుచేసిన భూముల్లో పంట వ్యర్థాలను శుభ్రంచేసి రెండో పంటగా జొన్న, మొక్కజొన్న సాగు ప్రారంభించారు. వీటి ప్రారంభం నుంచి మొక్కలు ఎదుగుదలకు యూరియా, బలానికి డీఏపీ వంటి ఎరువులు అందించాల్సి ఉంటుంది. పంటలకు ఇవి వాడకం తప్పనిసరి కావడంతో రైతులు వాటిని కొనుగోలు చేసేందుకు మార్కెటు యార్డుకు బారులు తీరుతున్నారు. ఇందుకు ప్రధానంగా ఎరువుల కొరత వస్తుందేమోనన్న భయం మరోపక్క సకాలంలో అందించకపోతే పంట ఎదుగుదలపై ప్రభావం చూపుతుందన్న ఆందోళనతో వాటి కొనుగోలుకు విక్రయ కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. పట్టణంలో అనేక ఎరువులు, పురుగు మందుల విక్రయ దుకాణాలు ఉన్నాయి. అయితే వాటిల్లో ఎమ్మార్పీ నిబంధనలు అమలు చేయకపోవడం, డీఏపీ వంటి ఎరువులు అందుబాటులో లేవంటూ రైతులకు చెప్పడంతో సాగుకు కష్టాలు తప్పవన్న ఉద్దేశంతో వాటి కోసం ఎంత సమయమైనా వెచ్చించి కొనుగోలు చేసేందుకు వెనకాడటం లేదు. ప్రభుత్వం తెనాలి మార్కెట్ యార్డు వద్ద గోదాములో ఏర్పాటుచేసిన జిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఎరువులు, పిండి మందులైన డీఏపీ ఇతర రసాయన పదార్థాలను నాణ్యత ప్రమాణాలతో ఎమ్మార్పీ ధరలకే విక్రయిస్తున్నారు. ఇందుకు రైతు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ బయోమెట్రిక్ ద్వారా పేరు నమోదు చేసుకుని వీటిని పొందవచ్చు. దీంతో రైతులు తెల్లవారుజామునుంచి మార్కెట్ యార్డులోని గోదాము వద్ద బారులు తీరుతున్నారు. అక్కడ సిబ్బంది ఒక్కరే ఉండటంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ పేర్లు నమోదు చేసుకుని రైతులకు రసీదులు ఇస్తూ ఆ తరువాత ఎరువులను అందజేస్తున్నారు. దీంతో రైతులు ఉదయం నుంచి సాయంత్రం వరకూ యార్డులో ఎరువుల కోసం పడిగాపులు కాస్తున్నారు. దీనికితోడు పలువురు రైతులు ఐదు బస్తాల యూరియాతో పాటు రూ.210 విలువ జేసే నానో యూరియా కొనిపిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇక ఎరువులు, పురుగుమందులు విక్రయించే వ్యాపారుల వద్ద ఎమ్మార్పీపై రూ.50, 70 వరకూ అధిక ధరలకు అమ్ముతూ బిల్లులు కూడా ఇవ్వడంలేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో ఎమార్పీకే మార్కెట్ యార్డు వద్ద గోదాములో అమ్మకాలు చేస్తుండటంతో వీటికోసం యార్డులో బారులు తీరుతున్నారు. గత ప్రభుత్వం మాదిరిగా ఇబ్బందులు పెట్టవద్దని, అధికారులు దృష్టిపెట్టి ఎరువుల దుకాణాల్లోనూ ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించేలా, ఎరువులు కొరత లేకుండా అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. అంతేకాకుండా మార్కెట్ యార్డులో రైతుల సమయం వృథా కాకుండా రెండు పూటలా రైతులకు ఎరువులు ఇప్పించి అన్నదాతలకు అండగా నిలవాలని రైతులు కోరుతున్నారు.

దోమలతో వ్యాపించే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● పట్టణ అసిస్టెంట్ మలేరియా అధికారి ప్రభాకరరెడ్డి

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు దోమల ద్వారా వ్యాపించే వివిధ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పట్టణ అసిస్టెంట్ మలేరియా అధికారి ప్రభాకరరెడ్డి అన్నారు. స్థానిక మారీసుపేట ఆర్‌ఆర్ నగర్‌లో సోమవారం ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో 'అగాపే లవ్' చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు పల్లికొండ రవికుమార్ ఆధ్వర్యంలో హాస్టల్‌లోని విద్యార్థినులకు దోమతెరలను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పట్టణ అసిస్టెంట్ మలేరియా అధికారి ప్రభాకరరెడ్డి పాల్గొని దోమతెరలను అందజేశారు. అనంతరం పట్టణంలోని ఎస్సీ గరల్స్ హాస్టల్, బీసీ బాయ్స్ హాస్టళ్లలో దోమతెరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, వంగల పున్నారెడ్డి, ఆరోగ్య విస్తరణాధికారి అందె చంద్రమౌళి, ఆరోగ్య పర్యవేక్షకులు బండారు మల్లేశ్వరావు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలను తొలగించినా మళ్లీ ఏర్పాటుకి యత్నం

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెంచుపేటలో ఫ్లెక్సీల విషయంలో ఘర్షణలు తలెత్తడంతో మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు వాటిని తొలగించారు. పురపాలక సంఘ అనుమతులు లేకుండా ఎటువంటి ఫ్లెక్సీలను, ఐరన్ ఫ్రేమ్‌లను ఏర్పాటు చేయరాదని ఆదేశించారు. కానీ సోమవారం అధికారుల ఆదేశాలను లెక్క చేయకుండా కొందరు ఉమేష్‌చంద్ర విగ్రహానికి సమీపంలో రోడ్డుకు అడ్డంగా భారీ పరంజాలు ఏర్పాటు చేసి ఫ్లెక్సీలను కడుతుండటం స్థానికంగా చర్చనీయాంశమైంది.

పెట్రోల్ బంకు సిబ్బందిపై దాడి

తెనాలి అర్బన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): బుర్రిపాలెంరోడ్డులోని పెమ్మసాని పెట్రోల్ బంక్‌లోని ఉద్యోగిపై యువకులు దాడిచేసి గాయపరిచారు. బీసీ కాలనీకి చెందిన అరవింద్ నాయుడు, రమేష్ నాయుడు ఆదివారం డబ్బాలో పెట్రోల్ కొట్టించుకునేందుకు వచ్చారు. బండి పక్కనపెట్టి రమ్మని చెప్పినందుకు మొత్తం ఐదుగురు బంక్‌లో పనిచేసే రాఘవేంద్రరావుపై దౌర్జన్యం చేసినట్లు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గ్రీవెన్స్‌కు 15 దరఖాస్తులు

తెనాలి అర్బన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 15మంది దరఖాస్తు చేశారు. రెవెన్యూ 5, పంచాయతీ, సివిల్ సప్లయిస్, మున్సిపల్ శాఖలకు సంబంధించి రెండు, పంచాయతీరాజ్, విద్య, విద్యుత్, పోలీసు శాఖలకు సంబంధించి ఒక్కొక్క దరఖాస్తు అందాయని అధికారులు తెలిపారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

తెనాలి క్రైం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తెనాలి బార్ అసోసియేషన్ సభ్యులు సోమవారం విధులకు గైర్హాజరయ్యారు. అనంతపురంనకు చెందిన సీనియర్ న్యాయవాది వీవీ శేషాద్రిని అక్కడ 3వ పట్టణ పోలీసులు, ఒక సివిల్ కేసు విషయంలో స్టేషన్‌కి పిలిపించి ఒత్తిడి చేయడంతో ఉద్వేగానికి గురై అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడని ఆరోపించారు. అదేవిధంగా రాయచోటి నియోజకవర్గంలో గాలివీడులో సీనియర్ న్యాయవాది మాజీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ సుదర్శన్‌రెడ్డిపై పోలీసులుసాగించిన దాష్టికానికి నిరసనగా సీనియర్, జూనియర్ న్యాయవాదులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేసినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్ తెలిపారు. బాధ్యులైన పోలీసు అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి హరిదాసు గౌరీశంకర్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది తాడిబోయిన శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అన్నంపిన్నారావు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మందలపు వేణుగోపాలరావు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

న్యాయవాదిపై దాడి చేసిన
పోలీసులపై చర్యలు తీసుకోవాలి

పొన్నూరు టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని న్యాయవాది బేతాళప్రకాష్‌పై దాడిచేసి అమానుషంగా వ్యవహరించిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని న్యాయవాదులు సోమవారం నిరసనకు దిగారు. పొన్నూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించిన న్యాయవాదులు ఐలాండ్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ నెల 26వ తేదీన కక్షిదారుల కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లిన న్యాయవాది బేతాళ ప్రకాష్‌పై అర్బన్ పోలీసులు అమానుషంగా వ్యవహరించడమే కాకుండా కొట్టినట్లు ఆరోపించారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదిపై దాడికి నిరసనగా నిరవధిక విధుల గైర్హాజరు కార్యక్రమం చేపడుతున్నట్లు బార్ అసోసియేషన్ తెలిపింది. కార్యక్రమంలో న్యాయవాదులు, న్యాయవాదుల గుమస్తాలు నల్లబాడ్జీలు ధరించి పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి

పొన్నూరు టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నిడుబ్రోలు రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు సోమవారం ప్రయాణికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ వ్యక్తి రెండు రోజులుగా పట్టణంలో సంచరిస్తూ రైల్వేస్టేషన్‌లో విశ్రమిస్తున్నట్లు తెలిపారు. ఆ వ్యక్తి సోమవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని శవ పరీక్షల నిమిత్తం బాపట్ల తరలించారు. బాపట్ల రైల్వే పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో పశువుల చావిడి దగ్ధం

పొన్నూరు టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తాళ్లపాలెంలో విద్యుదాఘాతంతో పశువుల చావిడి దగ్ధమైన సంఘటన సోమవారం జరిగింది. బాధితుల కథనం ప్రకారం తాళ్లపాలెం గ్రామానికి చెందిన పోకల శ్రీనివాసరావుకు చెందిన పశువుల చావడి తెల్లవారుజామున విద్యుదాఘాతం ఏర్పడి నిప్పంటుకుంది. అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం అందించగా వారు వచ్చేలోపే పశువుల చావిడి పూర్తిగా కాలిపోయింది.

7,962 మంది పట్ట భద్రుల ఓటర్లు

పొన్నూరు టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు నియోజకవర్గంలో 7,962 మంది పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లు ఉన్నట్లు తహసీల్దార్ జియావుల్ హక్ తెలిపారు. సోమవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల తుది ఓటర్ల జాబితాను ప్రదర్శించారు. పొన్నూరు పురపాలక సంఘంలో 261, 262 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 2165మంది, పొన్నూరు రూరల్ మండలంలో 263, 264 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 1418మంది, చేబ్రోలు మండలంలో 265, 266 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 1874మంది, పెదకాకాని మండలంలో 269, 270, 271 పోలింగ్ స్టేషన్ పరిధిలో 2,505 మంది ఉన్నట్లు వివరించారు. నియోజకవర్గంలో 4937 మంది పురుష ఓటర్లు, 3024మంది మహిళా ఓటర్లు, 1 ట్రాన్స్‌జెండర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు ఓటు హక్కు పొందినట్లు తెలిపారు.

బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా చలపతిరావు

పొన్నూరు టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): బీజేపీ పట్టణ నూతన అధ్యక్షుడిగా గోవాడ చలపతిరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం పట్టణంలోని గోవాడ వెంకట కృష్ణారావు గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చలపతిరావు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

బీజేపీ కొల్లిపర మండల అధ్యక్షుడిగా మండ్రు

తెనాలి అర్బన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): బోసురోడ్డులోని ఎస్ఆర్‌కే కల్యాణ మండపంలో సోమవారం బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో కొల్లిపర మండల పార్టీ అధ్యక్షుడిగా మండ్రు మురళీధర్‌ను ఎన్నుకున్నారు. మండల వెస్ట్ పార్టీ అధ్యక్షుడిగా వై.సందీప్‌రాజును ఎన్నుకున్నారు. రూరల్ మండల అధ్యక్షుడిగా కడియాల నందకిషోర్ ఎన్నికయ్యారు.

గ్రామాలాభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి

కొల్లిపర, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా కృషి చేయాలని ఎంపీపీ భీమవరపు పద్మావతి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. తొలుత ప్రభుత్వ అధికారులతో శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో విజయలక్ష్మి మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘ నిధులతో అభివృద్ధి పనులను నిర్దేత సమయంలో పూర్తి చేయాలన్నారు. పరిపాలనాధికారి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ 2025-26 అంచనా బడ్జెట్ రూ.14కోట్ల 12లక్షల 75 వేలను ఆమోదించారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షుడు బొల్లిముంత పోతురాజు, తహసీల్దార్ సిద్ధార్థ, ఈవోపీఆర్డీ బార్గవ్, ఏడీఏ ఉషారాణి, శాఖాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రైతులు పంటలను ప్రతి రోజు పరిశీలించుకోవాలి

కొల్లిపర, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రైతులు రబీలో వేసిన మొక్కజొన్న, జొన్న పంటలను ప్రతిరోజు పరిశీలించుకోవాలని ఏరువాక కేంద్రం జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.వెంకటలక్ష్మి అన్నారు. సోమవారం మండల పరిధిలోని దావులూరులో వేసిన మొక్కజొన్న, జొన్న పంటలను వ్యవసాయాధికారులు పరిశీలించారు. తెగుళ్లపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏడీఏ ఉషారాణి, వ్యవసాయ విస్తరణాధికారులు తదితరులు పాల్గొన్నారు.